సోమవారం
04-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 13
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మోదీ 'మాయ'

- ప్రత్యేక హోదాపై దగా
- విభజన హామీలేవి?
- నేడు 'అల్లూరి' విగ్రహావిష్కరణకు ప్రధాని
- దక్షిణాదిలో బీజేపీ పాగాకు పాట్లు
- వామపక్షాల తీవ్ర వ్యతిరేకత
- చలో భీమవరం పిలుపు: కాంగ్రెస్
- నల్లజెండాలతో నిరసనలు: విశాఖ ఉక్కు జేఏసీ
- రాష్ట్ర హక్కులపై వైసీపీ, టీడీపీ, జనసేన మౌనం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఏపీకి అడుగడుగునా దగా చేస్తోంది. ఆంధ్ర ప్రదేశ్‌కి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలులో మాట తప్పింది. వాటి అమలులో ఇంతవరకూ కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కనిపించలేదు. ఇచ్చినవి అమలు చేయకపోగా, మరోమారు ఏపీ ప్రజలకు మాయమాటలు చెప్పేందుకు ప్రధాని వస్తున్నారనే విమర్శలున్నాయి. పోలవరానికి సరిపడా నిధులు ఇవ్వకపోగా, పునరావాస ప్యాకేజీ సక్రమంగా అమలు చేయలేదు. వెనుకబడిన ప్రాంతాల జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా నాన్చుతోంది. మొత్తంగా పరిశీలిస్తే, నాడు ఎన్నికల సమయంలో తిరుపతి కేంద్రంగా మోదీ చేసిన వాగ్దానాలు నీటి మూటలుగానే మారాయి. కేంద్రం కడపలో స్టీలు ఫ్యాక్టరీ నిర్మించకపోగా, ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేసింది. ఇప్పుడు మోదీ ఆయా అంశాలను పక్కదారి పట్టించి, ప్రజల మధ్య కుల, మత, ప్రాంతీయ విభేదాలు సృష్టించేందుకు బయలుదేరారు. తాజాగా విగ్రహాల పేరిట ఏపీలోనూ మోదీ అడుగెట్టడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని వామపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. భీమవరం పట్టణంలో క్షత్రియ సేవా సమాజం అధ్వర్యంలో రూ.30 కోట్లతో, 30 అడుగుల అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో కేంద్రం రూ.9 కోట్లు అందించనుంది. అమృత్ మహోత్సవమ్ పేరిట కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 75

- మిగతా 2 లో

కేంద్రానికి అనూహ్య ఆదాయం

న్యూఢిల్లీ: ప్రజలపై ధరల భారాన్ని తగ్గించడం కోసం మే నెల ఆఖర్లో పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. దీనివల్ల కేంద్రం భారీగా ఆదాయాన్ని కోల్పోతోంది. అయితే, తాజాగా పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధించిన పన్ను, చమురు ఉత్పత్తిపై విధించిన విండ్‌ఫాల్ ట్యాక్స్‌తో.. ఎక్సైజ్ సుంకం కోత వల్ల కోల్పోతోన్న ఆదాయంలో మూడొంతులు సర్కార్ తిరిగి పొందనుంది. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్)పై ఎగుమతి సుంకాన్ని విధిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. పెట్రోల్, ఏటీఎఫ్‌పై లీటర్‌కు రూ.6 చొప్పున, డీజిల్‌పై లీటరుకు రూ.13 ఎగుమతి సుంకం విధించామని, జులై 1 నుంచి ఇది అమల్లోకి వచ్చినట్లు ఆర్థిక శాఖ పేర్కొంది. దేశీయంగా ఉత్పత్తి చేసే ముడిచమురుపై టన్నుకు రూ.23,250 చొప్పున విండ్‌ఫాల్ పన్ను వసూలు చేయనుంది. గతేడాది దేశీయంగా వివిధ సంస్థలు 29 మిలియన్ టన్నుల ముడిచమురు ఉత్పత్తి చేశాయి. ఈ లెక్కన చూస్తే, కొత్తగా విధించిన పన్ను వల్ల ప్రభుత్వానికి రూ.66వేల కోట్ల వార్షిక ఆదాయం జమకానుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలి ఉన్న 9 నెలలకు

- మిగతా 2 లో

తెలంగాణకు డబుల్ ఇంజిన్ సర్కార్

- ఆ దిశగా ప్రజలు పట్టాలు వేస్తున్నారు
- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తుంది
- విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ

మోదీని విమర్శిస్తే... దేశాన్ని విమర్శించినట్లా?
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శలు

8లో

విశాలాంధ్ర – హైదరాబాద్: తెలంగాణ ప్రజలు కూడా డబుల్ ఇంజన్ సర్కార్ తెచ్చేందుకు పట్టాలు వేస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఎంతో సహకరిస్తోందని తెలిపారు. తెలంగాణలో కళలు, నైపుణ్యం ఎంతో మెండుగా ఉన్నాయని, ఈ గడ్డ అనేక ఉద్యమాలకు, అనేక మందికి ఎంతో స్ఫూర్తిని ఇస్తోందని తెలిపారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ముగిసిన అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సభకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఈ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షత వహించగా బీజేపీ పాలిత రాష్ట్ర సీఎంలు, కేంద్ర, రాష్ట్ర కీలక నాయకులు హాజరయ్యారు. మోదీ

- మిగతా 2 లో

నేడు 'మహా' బలపరీక్ష

- స్పీకర్ ఎన్నికతో ప్రారంభమైన అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు
- విశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోనున్న ఏక్‌నాథ్ షిండే

2లో

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్

ఒక్క నిముషం ఆలస్యమైనా నిరాకరణ

పసిమనసుల్లో 'హిందూత్వ' బీజం

- బ్రాహ్మణ సిద్ధాంతాలు రుద్దే ప్రయత్నం
- కర్ణాటక పాఠ్యాంశాల్లో ఆర్ఎస్ఎస్-బీజేపీ స్తుతి
- సిలబస్ మార్పుపై కొనసాగుతున్న వివాదం

న్యూఢిల్లీ: హిందూత్వ అనే పదం వినిపించిన వెంటనే అందరికీ ముందుగా ఆర్ఎస్ఎస్–బీజేపీనే గుర్తుకు వస్తాయి. హైందవ మతాన్ని అడ్డుపెట్టుకొని హిందూత్వను ప్రబోధించే ప్రయత్నాన్ని కాషాయవర్గం ముమ్మరం చేసింది. దేశమంతటా 'కమలం' ముద్ర వేసేందుకు కుట్రలు–కుయుక్తులు–జిత్తులు ప్రదర్శిస్తోంది. అనుకున్నది సాధించేందుకు ఎంతకైనా వెనుకాడటం లేదు. విద్యార్థులపై భారం తగ్గించే నెపంతో పాఠ్యాంశాలను సవరిస్తోంది. మహనీయుల జీవితాలకు సంబంధించిన వాస్తవాలను వక్రీకరిస్తోంది. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు, హిందూత్వ సిద్ధాంతకర్తలను స్తుతిస్తోంది. తద్వారా పసిమనస్సుల్లో హిందూత్వ బీజం నాటుతూ కల్మషంలేని హృదయాలను మతం పేరిట కలుషితం చేస్తోంది. పాఠ్యపుస్తకాల్లో అనేక మార్పులు, చేర్పులు చేస్తూ కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వం మరింత ముందుకెళుతోంది. మహావీర, అక్కా మహాదేవి, బసవన్న, టిప్పుసుల్తాన్, పెరియార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కేబీ హెగ్డేవార్, కువెంపు తదితరుల గురించి వివరాలను చేర్చడం, మార్చడం, తొలగించడం జరిగింది. దీంతో కర్ణాటకలో పాఠ్యపుస్తకాలపై వివాదం కొనసాగుతోంది. హిందూత్వ సైద్ధాంతిక అంశాలను చేర్చడం మిగతా వాటిని తొలగించడం ద్వారా విద్య కాషాయీకరణ జరుగుతుందన్న వాదన బలంగా వినిపిస్తోంది. తొలుత తటపటాయించినా.. తర్వాత మరింత ఉధృతంగా పాఠ్యాంశాలను మార్చేస్తోంది. ప్రభుత్వ చర్యను వ్యతిరేకిస్తే దేశద్రోహులుగా ముద్రవేస్తోంది. ఓవైపు హిందూత్వ సంఘాలు, సంస్థలు ప్రభుత్వాన్ని సమర్థిస్తుంటే మరోవైపు పౌర సమాజం, సంఘాలు, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండటంతో ఓ రకంగా యుద్ధమే

- మిగతా 2 లో

లిసిచాన్స్క్‌ను స్వాధీనం చేసుకున్నాం

ఖారీవ్, మైకోలేవ్ ప్రాంతాల్లో సైనిక స్థావరాలు ధ్వంసం

రష్యా రక్షణ శాఖ ప్రకటన

మాస్కో: ఉక్రెయిన్ పశ్చిమ ప్రాంతంలోని డోన్బాస్ ప్రాంతంపై పట్టు సాధించినట్లు రష్యా ప్రకటించింది. కీలకమైన లూహాన్స్క్ ప్రాంతంలోని లిసిచాన్స్క్ నగరాన్ని పూర్తిగా తమ స్వాధీనంలోకి తీసుకున్నట్టు రష్యా రక్షణ శాఖ తెలిపింది. 'రష్యా దళాలు, లూహాన్స్క్ పీపుల్స్ రిపబ్లిక్ యూనిట్లు లిసిచాన్స్క్ నగరంలో ఉక్రెయిన్ దళాలతో పోరాడుతున్నాయి. ఈ క్రమంలో శత్రువును పూర్తి స్థాయిలో తరిమి కొట్టి నగరాన్ని స్వాధీనం చేసుకున్నాయి' అని రక్షణశాఖ ప్రకటన వివరించింది. లిసిచాన్స్క్ నగరమే కాకుండా పరిసరాల్లో ఉన్న గ్రామాలను కూడా పూర్తిగా ముట్టడించి మొత్తంగా నగరాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నామని తెలిపింది. ఉక్రెయిన్ తూర్పు ప్రాంత నగరమైన ఖారీవ్ లో ఉక్రెయిన్ మిలటరీ స్థావరంపై దాడి చేశామని, ఆ దేశ దక్షిణ ప్రాంతంలోని మైకోలేవ్ నగర శివార్లలో ఉన్న విదేశీ విమానాల స్థావరాన్నీ నేలమట్టం చేశామని ప్రకటించింది.

డోన్బాస్ పై పూర్తి పట్టు కోసం..

రష్యాకు సరిహద్దుగా ఉన్న ఉక్రెయిన్ ప్రాంతం డోన్బాస్ ను పూర్తి స్థాయిలో తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు రష్యా మొదటి నుంచీ ప్రయత్నిస్తోంది. డోన్బాస్ లోని లూహాన్స్క్, డోనెట్స్క్ రీజియన్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. అక్కడ ఇప్పటికే రష్యా మద్దతుతో వేర్పాటు వాదులు ఉక్రెయిన్ ప్రభుత్వ దళాలపై పోరాడుతున్నారు. వారితోపాటు రష్యా కూడా పెద్ద సంఖ్యలో దళాలతో కలిసి కీలక నగరాలను స్వాధీనం చేసుకుంటోంది.

రష్యా సైనిక స్థావరంపై దాడి

రష్యా దాడులతో అతలాకుతలం అవుతున్న ఉక్రెయిన్... అమెరికా, బ్రిటన్, ఇతర యూరోపియన్ దేశాలు పంపుతున్న ఆయుధాలతో ప్రతిదాడులు చేస్తోంది. ఈ క్రమంలో రష్యా స్వాధీనం చేసుకున్న మెలిటొపోల్ నగరంలో ఉన్న రష్యా సైనిక స్థావరంపై భారీ దాడికి దిగింది. 30కి పైగా స్వల్ప దూరశ్రేణి క్షిపణులను వరుసగా ప్రయోగించింది. మెలిటొపోల్ నగరాన్ని రష్యా స్వాధీనం చేసుకోవడంతో అక్కడి నుంచి పారిపోయి ఉక్రెయిన్ పరిధిలోకి వచ్చేసిన ఆ నగర మేయర్ ఇవాన్ ఫెడరోవ్ ఈ వివరాలు వెల్లడించారు. రష్యా సైనిక స్థావరం పూర్తిగా ధ్వంసమైపోయినట్టు సమాచారం వచ్చిందని తెలిపారు.

ఉక్రెయిన్ అనుకూల వాదులు మెలిటొపోల్ నగరం సమీపంలో రష్యా నుంచి ఆయుధాలతో వస్తున్న రైలును పట్టాలు తప్పేలా చేశారని వెల్లడించారు. రష్యా సైనిక స్థావరంపై దాడులు జరిగినట్టు ఆ దేశ వార్తా సంస్థ ఆర్ఐఏ కూడా నిర్ధారించింది. కానీ ఏ ప్రాంతంలో జరిగాయి, ప్రాణ నష్టం వివరాలేమీ వెల్లడించలేదు.

లోయలో పడిన బస్సు

19మంది దుర్మరణం

కరాచి: పాకిస్తాన్‌లో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న ప్యాసింజర్ బస్సు... అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోగా.. 11 మంది గాయపడ్డారు. బలూచిస్థాన్ రాష్ట్రంలోని క్వెట్టా సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. అతివేగం, భారీ వర్షం ప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 'క్వెట్టా సమీపానికి చేరుకోగానే డ్రైవర్ బస్సుపై నియంత్రణ కోల్పోయాడు. ఓ మలుపు వద్ద ఉన్న సమయంలో బస్సు లోయలో పడిపోయింది. ఇప్పటివరకు 19 మృతదేహాలను వెలికితీశాం. గాయపడ్డ 11 మందిని ఆస్పత్రిలో చేర్చాం' అని అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ మెహ్తాబ్ షా వెల్లడించారు.

క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నూర్ హక్ తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. మృతదేహాలకు శవపరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, బలూచిస్థాన్ సీఎం మీర్ అబ్దుల్ ఖుదూస్ బిజెంజో విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు.

మైన్మార్‌లో భూకంపం

యాంగాన్: మైన్మార్‌లో భారీ భూకంపం సంభవించింది. ఆదివారం ఉదయం 7.56 గంటలకు యాంగాన్‌లో భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.0గా నమోదయింది. యాంగాన్‌కు 260 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ తెలిపింది. భూకంపం వల్ల జరిగిన నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. కాగా, శనివారం తెల్లవారుజామున ఇరాన్‌లో భారీ భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. హోర్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో ఐదుగురు మరణించగా, 44 మంది గాయపడ్డారు. చైనాలోని జిన్‌జియాంగ్ ప్రాంతంలో 4.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. శనివారం తెల్లవారుజామున 3.29 నిమిషాలకు ఈ భూకంపం వచ్చిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ తెలిపింది.

నేడు 'మహా' బలపరీక్ష

ముంబై : మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సోమవారం రాష్ట్ర అసెంబ్లీలో బల పరీక్షను ఎదుర్కోనున్నారు. రెండున్నరేళ్ల మహా వికాస్ అగాడి (ఎంవీఏ) ప్రభుత్వాన్ని కూలదోయడం ద్వారా సీఎం కుర్చీలో కూర్చొన్న ఐదు రోజుల తర్వాత ఆయన విశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర శాసనసభ రెండు రోజుల ప్రత్యేక సమావేశాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్పీకర్‌ను ఎన్నుకోవడంతో నాలుగు రోజుల శివసేన-బీజేపీ ప్రభుత్వం సోమవారం బలపరీక్షను ఎదుర్కోనుంది. 288 మంది సభ్యుల సభలో 10 మంది చిన్న పార్టీలు, స్వతంత్రులు, 106 మంది బీజేపీ ఎమ్మెల్యేలు ఏకనాథ్ షిండేకు మద్దతు ఇస్తున్నారు. శివసేన ఎమ్మెల్యేల తిరుగుబాటుతో ముఖ్యమంత్రి పదవి నుంచి ఉద్ధవ్ థాక్రే వైదొలగే పరిస్థితులకు దారితీసింది. బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ దాదాపు 40 మంది ఎమ్మెల్యేలు థాక్రేపై తిరుగుబాటు చేశారు. గత వారం కొత్త ముఖ్యమంత్రిగా షిండే, ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవిస్ స్వీకారం చేశారు. శాసనసభలో శివసేనకు చెందిన 55 మంది ఎమ్మెల్యేలు రెండు వర్గాలుగా విడిపోయారు. 39 మంది షిండేతో, 16 మంది మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రేకి విధేయులుగా ఉన్నారు. అసెంబ్లీలో పార్టీల స్థానం కింది విధంగా ఉంది. శివసేన 55, ఎన్‌సీపీ 53, కాంగ్రెస్ 44, బీజేపీ 106, బహుజన్ వికాస్ అగాడి 3, సమాజ్‌వాది పార్టీ 2, ఏఐఎంఐఎం 2, ప్రహర్ జనశక్తి పార్టీ 2, ఎంఎన్ఎస్ 1, సీపీఎం 1, పీడబ్ల్యూపీ 1, స్వాభిమాని పక్షం 1, రాష్ట్రీయ సమాజ్ పక్షం 1, జన్‌సురాజ్ శక్తి పార్టీ 1, క్రాంతికారి షేట్కారి పార్టీ 1, స్వతంత్రులు 13. అయితే మే నెలలో శివసేన ఎమ్మెల్యే రమేశ్ లట్కే మరణించిన కారణంగా ఒక స్థానం ఖాళీగా ఉంది. మరోవైపు, ఇద్దరు ఎన్‌సీపీ సభ్యులు... ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, ఆహార, పౌర సరఫరాల మంత్రి చగన్ భుజ్‌బల్ కోవిడ్-19 మహమ్మారి బారిన పడ్డారు. కాగా పార్టీ శాసనసభ్యులు మరో ఇద్దరు అనిల్ దేశ్‌ముఖ్, నవాబ్ మాలిక్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. ఇదిలాఉండగా, ఏక్‌నాథ్ షిండేకు మద్దతుగా నిలిచిన శివసేన తిరుగుబాటు ఎమ్మెల్యేలు శనివారం రాత్రి గోవా నుంచి ముంబైకి తిరిగి వచ్చారు. వారు బల పరీక్ష ప్రాంతం అయిన విధాన్ భవన్‌కు సమీపంలోని దక్షిణ ముంబైలోని ఒక ఆధునాతన హోటల్‌లో బస చేశారు.

కేంద్రానికి అనూహ్య ఆదాయం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం రూ.52వేల కోట్ల ఆదాయాన్ని పొందనుంది. దీనికి ఎగుమతి పన్ను ద్వారా వచ్చే ఆదాయం అదనం. భారత్ ఏప్రిల్, మే నెలల్లో 2.5 మిలియన్ టన్నుల పెట్రోల్, 5.7 మిలియన్ టన్నుల డీజిల్, 7,97,000 టన్నుల ఏటీఎఫ్ ఎగుమతి చేసింది. తాజా పన్నుల వల్ల ఎగుమతులు మూడొంతులకు పడిపోయినా..ప్రభుత్వానికి రూ.20 వేల కోట్ల అదనపు ఆదాయం సమకూరనుంది. జామ్‌నగర్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్ చమురు శుద్ధి కేంద్రం ఏటా 35.2 మిలియన్ టన్నుల చమురును ఎగుమతి చేస్తోంది. అదనపు పన్ను విధించినప్పటికీ.. రిలయన్స్ ఎగుమతులను కొనసాగించనున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం మే 23న లీటర్ పెట్రోల్‌పై రూ.8, లీటర్ డీజిల్‌పై రూ.6 ఎగుమతి సుంకాన్ని తగ్గించిన విషయం తెలిసిందే. దీనివల్ల ప్రభుత్వం రూ.లక్ష కోట్ల ఆదాయాన్ని కోల్పోనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ ఏడాది మిగిలిన పది నెలల కాలానికి సర్కార్ రూ.84 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోయింది. అయితే, తాజాగా విధించిన అదనపు పన్నుల వల్ల 85 శాతం తిరిగి రానుంది.

తెలంగాణకు డబుల్ ఇంజిన్ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ 'సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్' అనే నినాదంతో తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తామని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెంచడంతో పాటు దళితులు, ఆదివాసీల ప్రమాణాలు పెంచేందుకు గడిచిన 8 ఏళ్లుగా అనేక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. తెలంగాణ ప్రాచీన, పరాక్రమాల గడ్డ, భద్రాచలంలో శ్రీరాముడు, యాదాద్రిలో లక్ష్మీనరసింహస్వామి జోగులాంబ అమ్మవారు, వరంగల్ భద్రకాళీ అమ్మవారి ఆశీర్వాదాలు ఉన్నాయన్నారు. కాకతీయులు వీరత్వం, శిల్పకళా సౌందర్యం ఎంతో గొప్పదని, ఇక్కడి సాహిత్యకారుల కృషి దేశానికే గర్వకారణమన్నారు. గత ఎనిమిదేళ్లలో ప్రతి భారతీయుడికి మంచి చేసే ప్రయత్నం చేశామని, దశాబ్దాల నుంచి వంచనకు గురైన వాళ్ల అభివృద్ధి కోసం పని చేశామన్నారు. తెలంగాణ సమగ్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా కృషి చేస్తుందన్నారు. రామగుండం ఎరువుల పరిశ్రమను తిరిగి ప్రారంభించడంతో పాటు రూ.35 కోట్లతో 5 ప్రాజెక్టులను చేపట్టామన్నారు. హైదరాబాద్‌లో అనేక ఫ్లై ఓవర్ల నిర్మాణంతో పాటు రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన వివరించారు. తెలంగాణాలో మెగా టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆవిష్కరణల్లో దేశంలోనే తెలంగాణ కేంద్రంగా మారిందని, తెలుగులో సాంకేతిక, వైద్య విద్య అందుబాటులోకి వస్తే పేదల కలలు సాకారమవుతాయని తెలిపారు. తమ పాలనలో గ్రామాల్లోని యువతకు ప్రోత్సాహం ఇస్తున్నామని, తెలంగాణ రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. పంటలకు కనీస మద్దతు ధర పెంచామని చెప్పారు.

తెలంగాణలో అధికారం మాదే: అమిత్ షా

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కేటీఆర్‌ని ముఖ్యమంత్రిని ఎలా చేయాలనే ఆలోచన తప్ప ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మరో ఆలోచన లేదని అన్నారు. ఈ ముఖ్యమంత్రి సచివాలయంలో కాలు పెట్టకుండానే వాస్తు పేరుతో దాని నేలమట్టం చేశారని మండిపడ్డారు. దేశం పురోగమిస్తుంటే తెలంగాణ తిరోగమిస్తోందని, తెలంగాణ ఉద్యమ సమయంలో మేం మద్దతిచ్చాం, గతంలో మేం మూడు రాష్ట్రాలు ఏర్పాటు చేసినప్పుడు ఎలాంటి సమస్యలు రాలేదన్నారు. టీఆర్ఎస్ కారు స్టీరింగ్ అసదుద్దీన్ ఒవైసీ చేతుల్లో ఉందని, నాడు పటేల్ లేకుంటే హైదరాబాద్ రాష్ట్రం భారత్‌లో భాగం అయ్యేది కాదన్నారు. తెలంగాణలో వారసత్వ రాజకీయాలకు ముగింపు పలుకుతామన్నారు.

బీజేపీలో చేరిన మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

చేవేళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి బీజేపీలో చేరారు. పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సభలో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి తరుణ్ చుగ్ కొండా విశ్వేశ్వరరెడ్డి చేయి పట్టుకుని కార్యకర్తలకు అభివాదం చేయించారు. కొండా విశ్వేశ్వరరెడ్డి టీఆర్ఎస్ తరపున లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు.

మోదీ 'మాయ'

(మొదటిపేజీ తరువాయి)

చోట్ల ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన యోధులకు నివాళులర్పించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఇప్పుడు అల్లూరి 125వ జయంతోత్సవాలను పురస్కరించుకుని, భీమవరంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మోదీ వస్తున్నారు. మోదీ పర్యటనపై నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు మోదీతోపాటు గవర్నరు, సీఎం జగన్ హాజరవుతారు. చంద్రబాబు, చిరంజీవికి ప్రత్యేకంగా ఆహ్వానాలు వెళ్లాయి. ఏపీ కాంగ్రెస్ ఏకంగా మోదీ పర్యటనను అడ్డుకుంటామని, రాష్ట్ర వ్యాప్తంగా నల్ల జెండాలు, బెలూన్లతో నిరసనకు దిగుతామని ప్రకటించింది. విశాఖ ఉక్కు పరిరక్షణ జేఏసీ, జై ఆంధ్రా డెమొక్రాటిక్ ఫోరమ్ సైతం నల్ల బెలూన్లతో నిరసనకు దిగుతామని వెల్లడించింది. నాడు సర్దార్ వల్లభాయ్ పటేల్ పొడవైన విగ్రహాన్ని మోదీ నెలకొల్పారు. అంతటితో ఆగకుండా ఇప్పుడు భీమవరంలో అల్లూరి విగ్రహాన్ని ప్రారంభించనున్నారు. స్వాతంత్రోద్యమంలో ఎలాంటి భాగస్వామ్యంలేని బీజేపీకి, అల్లూరి పేరు ప్రస్తావించే అర్హత లేదని వామపక్షాలు ధ్వజమెత్తుతున్నాయి. ఏపీకి రావాల్సిన నిధులు, ప్యాకేజీ, హామీలపై మోదీ పక్కదారి పట్టించేందుకే, ఈ తరహా పర్యటనలకు రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీజేపీకి పరోక్షంగా, ప్రత్యక్షంగా మద్దతిస్తున్న ఏపీలోని వైసీపీ, టీడీపీ, జనసేన దీనిపై సమాధానం చెపాల్సిన అవసరముంది.

దక్షిణాదిలో పట్టుకోసం బీజేపీ యత్నం

మోదీ మరోమారు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలను మాటల గారడితో మోసగిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణాలో పూర్తయిన మోదీ పర్యటన, సోమవారం భీమవరంలో కొనసాగనుంది. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ ఎంతోకొంత పట్టు సాధించాలనే తపనతో ఇప్పుడు స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నిలువెత్తు విగ్రహం అంశాన్ని తెరపైకి తెచ్చింది. ఆ విగ్రహావిష్కరణకు మోదీ వచ్చి, అల్లూరిని వశం చేసుకునేందుకు ఆరాటపడుతున్నారు. ఈ చర్యలను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. వాస్తవంగా స్వాతంత్రోద్యమంలో నాడు కమ్యూనిస్టులు, కాంగ్రెస్, ముస్లిమ్‌లీగ్ పార్టీలే పాల్గొనగా, బీజేపీ మాతృసంస్థయిన ఆరెస్సెస్ జాడ ఎక్కడా కనిపించలేదు. పైపెచ్చు బ్రిటీష్ వారికి పరోక్షంగా సహకరించి, దేశానికి తీవ్ర మోసం చేశారు. బీజేపీ, మోదీ సైతం నేడు అల్లూరి విగ్రహం పేరిట రాజకీయ పర్యటనలకు రావడం ఆక్షేపణీయంగా మారింది. అల్లూరి పేరును ప్రస్తావించే అర్హత మోదీకి ఏ మాత్రం లేదంటూ మండిపడుతున్నాయి.

జగన్ వైఖరి స్పష్టం చేయాలి

నాడు పాదయాత్రలో తనకు 25 మంది ఎంపీ సీట్లు ఇస్తే, కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తామన్న సీఎం జగన్, ఇప్పుడు కేంద్రం వద్ద ఎందుకు మెడలు వంచుతున్నారంటూ వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ నిలదీస్తున్నాయి. హోదా ఇస్తేనే, రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతిస్తానని జగన్ మోదీని డిమాండు చేయాలని అంటున్నప్పటికీ, జగన్ మౌనంగా ఉంటున్నారు. భీమవరంలో జరగబోయే మోదీ బహిరంగ సభ వేదికగా ప్రత్యేక హోదా, విభజన హామీలపై స్పష్టమైన ప్రకటన చేయాల్సిన అవసరం ఉంది. సభా వేదిక సాక్షిగా రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించాల్సి ఉంది. వైసీపీ శ్రేణులంతా మోదీని అడ్డుకోవాలి. లేకుంటే జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేసినట్లవుతుంది. అటు ప్రతిపక్ష టీడీపీతోపాటు బీజేపీ కూటమిలోని జనసేన పార్టీ సైతం మోదీని కలిసి రాష్ట్ర హక్కుల కోసం ప్రశ్నించాలి. మోదీ పర్యటనను అడ్డుకోవాల్సిన అవసరం ఉంది.

మోదీ పర్యటనను అడ్డుకుంటాం: పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజీవ్‌రతన్

భీమవరంలో మోదీ పర్యటనను అడ్డుకుంటామని పీసీసీ (ఆర్గనైజేషన్) ప్రధాన కార్యదర్శి పరసా రాజీవ్‌రతన్ వెల్లడించారు. సీఎం జగన్ తన వ్యక్తిగత అజెండాను పక్కనపెట్టి, అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విభజన హామీలను అమలు చేయని ప్రధాని మోదీ ఈ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ కాంగ్రెస్ చలో భీమవరం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నల్ల జెండాలు, బెలూన్లతో నిరసన తెలుపుతూ, మోదీ పర్యటనను అడ్డుకుంటామని వెల్లడించారు. ప్రత్యేక హోదా కోసం ఈనెల 7న నిరసనలు చేపడతామని, 11, 12 తేదీల్లో ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తామన్నారు. ప్రత్యేక హోదాతో పాటు విభజన హామీలను అమలు చేస్తేనే, రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతిస్తానని సీఎం జగన్ షరతు విధించాలని రాజీవ్ రతన్ డిమాండు చేశారు.

పసి మనసుల్లో 'హిందూత్వ' బీజం

(మొదటిపేజీ తరువాయి)

సాగుతోంది. పాఠ్యపుస్తకాల సవరణ రాజకీయం: దశాబ్దకాలంలో పాఠ్యపుస్తకాలను దాదాపు మూడుసార్లు సవరించారు. బీజేపీ హయాంలో రెండుసార్లు, కాంగ్రెస్ హయాంలో ఒకసారి మార్పులు-చేర్పులు జరిగాయి. 2008-13లో దాదాపు పాఠ్యపుస్తకాలను బీజేపీ సమీక్షించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించేలా కొన్ని మార్పులు చేసింది. 2019లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పార్టీ ఫిరాయించేలా చేయించి బీజేపీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌ను దొంగ దెబ్బతీసింది. అప్పటికి ప్రాథమిక విద్యాశాఖ మంత్రి 2021 సెప్టెంబరులో రోహిత్ చక్రతీర్థను ఎంపిక చేశారు. కాంగ్రెస్ హయాంలోని బరాగుర్ కమిటీ సవరించిన పుస్తకాలను సమీక్షించాలని ఆదేశాలిచ్చారు. సాంఘికశాస్త్రంపై దృష్టి పెట్టారు. నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు.

రోహిత్ చక్రతీర్థది సంపూర్ణ ఆర్ఎస్ఎస్ కమిటీ. హిందూత్వ సిద్ధాంతాలకు ప్రసిద్ధి. ప్రగతిశీల, వామపక్ష భావజాలాల వ్యతిరేకి. బొమ్మై నేతృత్వ బీజేపీ ప్రభుత్వం అధ్వర్యంలో 2021లో కర్ణాటకలో రోహిత్ కమిటీ సమీక్ష నిర్వహించింది. పాఠపుస్తకాల్లో సవరణలను పరిశీలించింది. కానీ కాంగ్రెస్ హయాంలోని బరాగుర్ కమిటీ తరహా నైపుణ్యత ఈ కమిటీలో లోపించింది. పాఠ్యపుస్తకాల సమీక్షా కమిటీ చైర్‌పర్సన్ విద్యార్హతలపై మీడియా నిలదీయగా విద్యాశాఖ మంత్రి సైతం తెల్లముఖం పెట్టడం కనిపించింది. రోహిత్ కమిటీ నివేదికను ప్రభుత్వం ఆమోదించింది. ఆ నివేదికలో ఏమున్నదో బహిర్గతం చేయలేదు. దీంతో బోధన, విద్యార్థి సంఘాల్లో ఓ రకమైన ఆత్రుత నెలకొంది. ముద్రణ క్రమంలో కొన్ని అంశాలు బయటకు రాగా అంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. పాఠ్యపుస్తకాల పీడీఎఫ్ ప్రతులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా నిరసనలు మిన్నంటాయి. బ్రాహ్మణ-హిందూత్వ దృక్పథంతో కూడిన అజెండాతో పాఠ్యాంశాల సవరణ, చేర్పింపు జరగడానికి వ్యతిరేకంగా సర్వత్రా ఆందోళనలు జరిగాయి. రోహిత్ కమిటీ సూచించిన 90శాతం చేర్పులు దక్షిణ కర్ణాటక బ్రాహ్మణ రచయితలవిగా ఉండటం, ఆ వర్గ భావజాలం, సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే రచనలు ఉండటం కనిపించింది. గతంలో ఉన్నవాటి తరహాలో కాకుండా కేవలం హిందూత్వను ప్రబోధించే ప్రయత్నాన్ని నిపుణులు ఆక్షేపించారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు కేబీ హెగ్డేవార్ ప్రసంగాన్ని చేర్చడంతో బీజేపీ ప్రభుత్వ వాస్తవ ఉద్దేశం బహిర్గతమైంది. వారు ఏ తరహాలో పిల్లల మనస్సులను మతం పేరిట కలుషితం చేయాలని అనుకుంటున్నది స్పష్టమైంది. చరిత్రలో దళిత-బహుజన భారతావని ప్రస్తావనే లేకుండా ఆర్ఎస్ఎస్-బీజేపీ తుడిచిపెట్టేసింది. మైసూర్ టైగర్ టిప్పుసుల్తాన్ పాఠ్యాంశాన్ని తొలగించడంతో ఇది మొదలైంది. సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు అందించిన తోడ్పాటు గురించి పుస్తకాల్లో మాటైనా లేకుండాచేసింది. ఆయనను ముస్లిం మతోన్మాదిగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. భగత్ సింగ్‌కు సంబంధించిన పాఠాన్ని తొలగించింది. అయితే విద్యార్థి సంఘాల ప్రతిఘటన క్రమంలో ఆయనపై హిందూత్వ దృక్కోణపు రాతలను చేర్చింది. విప్లవయోధులు, తిరుగుబాటు నాయకులు, ముస్లిం చక్రవర్తులను దేశద్రోహులుగా చూపడమే కాకుండా బ్రాహ్మణుల అణచివేత విధానాలను వ్యతిరేకించిన అక్కా మహాదేవి, కనకదాస, సూఫీ సెయింట్లు తదితరుల గురించీ రాతలేవీ పుస్తకాల్లో లేకుండా ఆర్ఎస్ఎస్-బీజేపీ చేసింది. దీంతో అన్ని వర్గాల నుంచి మెల్లమెల్లగా ప్రతిఘటన ఎదురవుతోంది. రాష్ట్రంలోని ఆర్ఎస్ఎస్-బీజేపీ కుయుక్తుల ఎదుట ప్రజా ఉద్యమం బలంగా నిలవలేకపోతోంది. మద్దతు లేకపోవడం, లింగాయత్ వంటి సామాజిక వర్గాలను తమవైపునకు బీజేపీ తిప్పుకుంటుండటంతో ఉద్యమానికి మద్దతు తగ్గుతోంది. ఇటీవల ప్రధాని మోదీ లింగాయత్ మఠాలను సందర్శించడం బీజేపీకి కలిసివచ్చింది. హిందూత్వం... బ్రాహ్మణ హిందూత్వగా అవతరించింది. దీనిని ఓడించే దిశగా సామాజిక చైతన్యానికి ప్రస్తుత ఉద్యమం రూపంలో తొలి అడుగు పడింది.

నేటి నుంచి ఏపీ ఈఏపీసెట్

- 4 నుంచి 8 వరకు ఇంజినీరింగ్
- 11, 12 తేదీల్లో బైపీసీ విభాగం పరీక్షలు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా నిరాకరణ
- 3 లక్షలకుపైగా అభ్యర్థుల దరఖాస్తు
- ఏపీ, తెలంగాణలో పరీక్షా కేంద్రాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా(ఏపీ ఈఏపీ)-2022 పరీక్షలను ఈనెల 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇంజినీరింగ్ విభాగం పరీక్షలను ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు రోజుకు రెండు చొప్పున 10 విడతలుగా నిర్వహిస్తారు. బైపీసీ విభాగం పరీక్షలను ఈనెల 11, 12 తేదీల్లో నాలుగు సెషన్లుగా జరుగుతాయి. పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు. అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయానికి గంట ముందుగానే చేరుకోవాలి. జేఈఈ వంటి జాతీయ పరీక్షలకు అమలు చేస్తున్న తరహాగానే, ఒక్క నిమిషము నిబంధనను ఈఏపీ సెట్‌కు కూడా అమలు చేస్తున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అధ్వర్యంలో పరీక్షల ఏర్పాట్లు చేపట్టారు. ఈ విడత ఇంటర్ మార్కులకు వెయిటేజీ ఉండబోదు. ఏపీ ఈఏపీ సెట్ మార్కులు/ర్యాంకుల ప్రాతిపదికనే ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి అభ్యర్థి హాల్‌టికెట్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలను తీసుకు రావాలి. బాల్‌పాయింట్ పెన్నులు, రఫ్ వర్క్ చేసుకోవడానికి అవసరమైన కాగితాలను పరీక్ష కేంద్రాల్లోనే ఇస్తారు. పరీక్షల సమయాల్లో విద్యార్థులకు అనువుగా ఉండేలా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ విడత ఏపీ ఈఏపీ సెట్‌కు 3,00,084 మంది దరఖాస్తు చేశారు. ఏపీలో 120, తెలంగాణలో రెండు చొప్పున పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

రబ్బరు స్టాంపు రాష్ట్రపతి కావద్దు

ముర్మును కోరిన యశ్వంత్‌సిన్హా

బెంగళూరు: రబ్బరు స్టాంపు రాష్ట్రపతిగా ఉండబోనని స్పష్టంగా చెప్పాలని ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్మును ప్రత్యర్థి, విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హా కోరారు. తాను ఎన్నికైతే రాజ్యాంగానికి కట్టుబడి ఉంటానని, అధికారాలను రాజ్యాంగబద్ధంగా వినియోగిస్తానని, తప్పు జరిగితే ఉపేక్షించబోనని సిన్హా చెప్పారు. ఇదే తరహా ప్రతిజ్ఞ తీసుకోవాలని ముర్మును కోరారు. రాజ్యాంగ పరిరక్షకునిగా ఉండే నిష్పక్షపాత రాష్ట్రపతి దేశానికి అవసరం గానీ మౌనం వహించే రబ్బరుస్టాంపు రాష్ట్రపతి కాదని ఉద్ఘాటించారు. అలా ఎట్టిపరిస్థితుల్లో ఉండనని చెబుతూనే ముర్ము కూడా ఇలా సంకల్పించాలన్నారు. ఆపరేషన్ కమల్ తరహా అప్రజాస్వామిక చర్యలను చేపడితే కేంద్రప్రభుత్వంపై భయం, జంకు లేకుండా చర్యలు తీసుకుంటానని ముర్ము ప్రకటించాలని సిన్హా కోరారు. భారత్‌లో మతఘర్షణల-మతవిభజన చర్యలను వ్యతిరేకిస్తానని స్పష్టంచేయాలని, పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ, వాక్ స్వేచ్ఛ, రాజ్యాంగబద్ధంగా హక్కులను పరిరక్షిస్తానని ప్రకటన చేయాలని ముర్ముకు సిన్హా సూచించారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులను చూస్తే మనం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా అనే సందేహం వస్తోందన్నారు. మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని కూల్చివేయడం, అంతకుముందు కర్ణాటక, మధ్యప్రదేశ్, గోవా, అరుణాచల్ ప్రదేశ్‌లోనూ బీజేపీ ఇదే తరహాలో ప్రభుత్వాలను గద్దెదించడాన్ని ప్రస్తావించారు.

కేంద్రంలో అధికారంతో పాటు ధనబలం ఉంది కదా అని దానిని దుర్వినియోగం చేసి..పార్టీలను చీల్చేస్తూ ప్రజాతీర్పును అగౌరవిస్తూ ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చేస్తుంటే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వైఖరి ఆమోదయోగ్యం కాదని తేల్చిచెప్పారు. కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం యువతరాన్ని తప్పుదోవ పట్టిస్తోందని, వారిలో మతబీజం నాటుతోందని, పాఠ్యాంశాల్లో మార్పు, వాటి 'కాషాయికీకరణ'నుద్దేశించి సిన్హా అన్నారు. ఎన్డీయే తరపు రాష్ట్రపతి అభ్యర్థి అంటే తనకు ఎంతో గౌరవమని, ఆమె ఎట్టిపరిస్థితుల్లో రబ్బరు స్టాంపు రాష్ట్రపతి కాకూడదని, ఇదే సంకల్పం ఆమె తీసుకోవాలని అన్నారు. బీజేపీ మాజీ అధికార ప్రతినిధి నూపుర్ శర్మ వ్యవహారంలో స్పందించిన తీరుకుగాను న్యాయవ్యవస్థపై అనుచిత ఆరోపణలు రావడం ఆందోళనకరమన్నారు. ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖలను రాజకీయ ప్రత్యర్థులపై కక్షసాధింపునకు కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బెంగళూరు పర్యటనలో ఉన్న సిన్హా అక్కడ కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశానికి హాజరయ్యారు. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత సిద్ధరామయ్య, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్, నాయకులు, శాసనసభ్యులు హాజరయ్యారు. నూపుర్ శర్మ వ్యవహారంలో సుప్రీం చేసిన వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల్లో దుయ్యబట్టడాన్ని సిన్హా ఖండించారు. సర్వోన్నత న్యాయస్థానాన్ని, న్యాయ వ్యవస్థను విమర్శించడం, దూషించడం, చౌకబారు వ్యాఖ్యలు చేయడం ఆక్షేపణీయమని సీఎల్పీ సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడిన సిన్హా అభిప్రాయపడ్డారు. మనమంతా న్యాయ వ్యవస్థను గౌరవిస్తాం. రామజన్మభూమి తీర్పుపై అమితానందాన్ని ప్రదర్శించి ఇప్పుడు విమర్శలు చేయడం బీజేపీకి తగదని అన్నారు. ఇలాంటి పరిస్థితి ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు. జేడీఎస్ అధినేత హెచ్‌డీ దేవెగౌడను కలవడం లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ప్రధాని సభకు...సర్వం సిద్ధం

భారీ ఏర్పాట్లు.... తప్పని ఇక్కట్లు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ప్రధాని మోదీ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరానికి రానున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి గన్నవరం చేరుకుంటారు, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో భీమవరం వస్తారు. గన్నవరం విమానాశ్రయంలో గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సీఎం జగన్‌తో సహా మంత్రులు, అధికారులు ప్రధానికి స్వాగతం పలుకుతారు. ఆయనతో పాటు సీఎం హెలికాప్టర్‌లోనే భీమవరం చేరుకోనున్నారు. ఇందుకోసం ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని భీమవరం వేదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించనున్నాయి.

16 ఎకరాలు...లక్ష మంది జనం

ఇందుకోసం భీమవరం దగ్గర, కాళ్ల మండలంలోని పెదఅమిరంలో 16 ఎకరాల్లో భారీ వేదిక ఏర్పాటు చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు 30 అడుగుల కాంస్య విగ్రహాన్ని ప్రధాని ఆవిష్కరించనున్నారు. అక్కడే బహిరంగ సభ ఏర్పాటు చేశారు. భారీ వర్షాల కారణంగా సభకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు ప్రారంభించారు. దాదాపు లక్ష మంది సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వేదికపై ప్రసంగాలను వీక్షించేందుకు గ్యాలరీలతోపాటు భీమవరం పట్టణ పరిసరాల వరకు ఎల్ఈడీ స్క్రీన్లు సిద్ధం చేశారు. ప్రధాని రాకపోకలకు వీలుగా నాలుగు హెలిప్యాడ్లు సిద్ధమయ్యాయి. ప్రధాని వేదికతో పాటు సమీపంలోనే మరో వేదిక సిద్ధం చేశారు. దానిపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీవీఐపీ, వీఐపీల కోసం ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేశారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు భారీగా జన సమీకరణ చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు వేల బస్సులను ఏర్పాటు చేస్తోంది. ఇక, ప్రయివేటు సంస్థల నుంచి సేకరించిన మరో ఏడు వేల బస్సులను జన సమీకరణకు వినియోగిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటుగా పొరుగు రాష్ట్రాలు..ప్రవాసాంధ్రులు సైతం తరలి వస్తారని నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధాని పాల్గొనే ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు చిరంజీవి హాజరుకానున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా చిరంజీవిని ఆహ్వానించారు. చిరంజీవి సొంత జిల్లా కావడం, కేంద్రం నుంచి ఆహ్వానం అందడం, అల్లూరి సీతారామ రాజు కార్యక్రమం కావడంతో ఆయన హాజరు అవుతున్నట్లు సమాచారం.

'అల్లూరి' స్ఫూర్తితో పోరాటాలకు సమాయత్తం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల పిలుపు

విశాలాంధ్ర-గుంటూరు : స్వాతంత్ర్య సమర యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అందించిన స్ఫూర్తితో దేశాన్ని దివాలా తీయిస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్‌ను గద్దె దించేందుకు పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని వామపక్ష పార్టీల అధ్వర్యాన గుంటూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాజ్ కూడలిలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, నళినీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముప్పాళ్ల మాట్లాడుతూ బీజేపీకి దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక్క గంట కూడా పాల్గొన్న చరిత్ర లేదని, బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులు ఒక్కరు కూడా స్వాతంత్ర్య పోరాటంలో అరెస్టు కాబడలేదని, జైలుకు వెళ్లలేదని గుర్తుచేశారు. తమకున్న ఆర్థిక బలంతో, అదానీ, అంబానీలు, ఇతర కార్పొరేట్ శక్తుల అండదండలతో రెండవ సారి అధికారంలోకి వచ్చిన మోదీ... ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి తమ దుర్మార్గాలకు రైతులను బలిచేశారని మండిపడ్డారు. తప్పుడు విధానాలతో యువతను వంచించారని ధ్వజమెత్తారు. దేశ పారిశ్రామిక రంగాన్ని కార్పొరేట్‌లకు దోచిపెడుతూ దేశాన్ని దివాళా తీయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ స్థితిలో ప్రజల్లో తమ ప్రభావాన్ని కోల్పోతున్నామని గుర్తించిన బీజేపీ నేతలు అంబేద్కర్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి దేశభక్తులైన అగ్రనాయకులను హిందూ మతానికి, బీజేపీకి చెందిన వారుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇటువంటి దుర్మార్గాలను ప్రజల్లో ఎండగట్టి రానున్న ఎన్నికలలో బీజేపీని గద్దె దించాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ... గిరిజనులను మెరికల్లా తయారు చేసి బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబెట్టిన ఘనత అల్లూరికే దక్కుతుందన్నారు. కుల, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడిన అల్లూరి విగ్రహాన్ని నరేంద్ర మోదీ ఏ విధంగా ఆవిష్కరిస్తారని ప్రశ్నించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ... ఆర్థిక, పారిశ్రామిక రంగాలను కబళించే వారికి ఆప్తమిత్రుడుగా ఉన్న మోదీకి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసే అర్హత లేదన్నారు. ప్రజలు నరేంద్ర మోదీ చేసే వికృత విన్యాసాలను గ్రహించి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ ఎం. హనుమంతరావు, సీపీఐ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాసర్ జీ, నగర కార్యదర్శి శశి, సాయి, దూపాటి వెంకట రత్నం, విజయకుమార్, తిరుమల, చల్లా ఏసురత్నం, సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, నికల్సన్, ముత్యాల రావు, శ్రీను, అరుణ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూళ్లలో ఇంటర్ విద్య ప్రారంభించాలి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ విద్యాసంవత్సరం నుంచే 882 ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ విద్యను ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఇంటర్ విద్య ప్రారంభించడానికి పాఠశాలలను గుర్తించినప్పటికీ విద్యార్థుల ప్రవేశాలు, ఉన్నతీకరణపై ఇంతవరకు మార్గదర్శకాలు విడుదల చేయలేదన్నారు. దీంతో విద్యార్థులు ఇతర కళాశాలల్లో చేరుతున్నారని, వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతవరకు విద్యార్థులకు నష్టం కలగకుండా అతిథి లెక్చరర్ల నియామకానికి వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నిబద్ధతకు నిలువుటద్దం 'మాదు'

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్

విశాలాంధ్ర-కంకిపాడు: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడి కాకలుతీరిన కమ్యూనిస్టుగా పేరు గడించిన తొలితరం కమ్యూనిస్టు మాదు నాగేశ్వరరావు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. మండలంలోని ఈడుపుగల్లు సీతారామ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన కమ్యూనిస్టు, గీత కార్మిక సంఘ నాయకుడు మాదు నాగేశ్వరరావు సంస్మరణ సభలో విల్సన్ మాట్లాడారు. భూపోరాటాల్లో పాల్గొని, ప్రజల పక్షాన నిలబడి పేదలకు స్థలల పంపిణీలో నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారన్నారు. కొమ్ములు తిరిగిన కమ్యూనిస్టు నేతలు దండమూడి రాజగోపాలరావు, కామినేని ఈశ్వరరావు లాంటి ఉద్దండులైన వారితో ఆయన జాతీయ స్థాయిలో పోరాటాలు చేశారన్నారు. ప్రకృతి వైద్యంపై నలుదిశలా విస్తృతమైన ప్రదర్శనలిచ్చి ఆరోగ్యకరమైన జీవితానికి పునాదులేశారని తెలిపారు. కృష్ణాజిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వెలగపూడి ఆజాద్ మాట్లాడుతూ నీతి, నిజాయతీ, క్రమశిక్షణ, సమయపాలన, అకుంఠిత దీక్ష నాగేశ్వరరావు సొంతమని, ప్రతి కమ్యూనిస్టు ఇలాంటి లక్షణాలతో ముందుకు వెళ్లాలని కోరారు. తొలుత మాదు నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. సీపీఐ జిల్లా నాయకులు మేరుగు విజయకుమార్ అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీ తాతయ్య, సీపీఐ నాయకులు మున్నంగి నరసింహరావు, బండి ప్రేమ్‌కుమార్, మర్రి ముత్యాలు, బండి వెంకటరత్నం, పోతురాజు నాగేశ్వరరావు, బాలస్వామి, మోతుకూరు అరుణ్‌కుమార్, కొప్పుల రమేష్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎం. హరిబాబు, రెడ్డియ్య, పంచకర్ల రంగారావు పాల్గొని నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకుడు ఆర్ పిచ్చయ్య ఆలపించిన గేయాలు సభికులను ఆలరించాయి. ఈ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్యే కేపీ సారథి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పల హరిత, గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్సీ బాబూ రాజేంద్రప్రసాద్, జెడ్పీటీసీ బాకీ బాబు, నేతలు దేవినేని అవినాష్, లాం తాంతియా కుమారి, బీసీ సంఘ నేతలు మాదు వసంతరావు, పామర్తి జయప్రకాష్ పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధంకండి

మహాసభలో మాట్లాడుతున్న పీజే చంద్రశేఖర్‌రావు

విశాలాంధ్రబ్యూరో-ఒంగోలు: సంతనూతలపాడు నియోజకవర్గ సీపీఐ మహాసభ ఆదివారం మద్దిపాడు మండలం మారెళ్లగుంటపాలెంలో జరిగింది. ముందుగా పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకుడు నల్లూరి గోవిందయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభకు అధ్యక్ష వర్గంగా ముత్తన అంజయ్య, చిరంజీవిలు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ... బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసిందని, ఫలితంగా దేశ రాజకీయాలు ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న విధానాలతో ఆర్థిక వ్యవస్థ పతనమవుతోందని అన్నారు. ఎక్కడికక్కడ ధరలు పెరిగి సామాన్యులు జీవించే పరిస్థితి లేకుండా పోయిందని, ఈ సమయంలో పోరాటాలకు సన్నద్ధం కావాలని పీజే పిలుపునిచ్చారు. సీపీఐని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసుకుంటూ ప్రజా పోరాటాలను కొనసాగించాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ...ప్రశ్నించే హక్కును కూడా ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని తెలిపారు. కొత్తగా ఎన్నిక అవుతున్న నూతన కమిటీ సభ్యులు ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. మహాసభలో సంతనూతలపాడు నియోజక వర్గ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 29 మందితో సమితిని ఎన్నుకోగా వీరిలో 9 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్ను కున్నారు. నూతన నియోజకవర్గ కార్యదర్శిగా నల్లూరి మురళితో పాటు కార్యవర్గ సభ్యులుగా దాసరి అంజయ్య, ముత్తన అంజయ్య, సురేంద్ర బాబు, చెంచయ్య, రమేష్, అనంతలక్ష్మి, చిరంజీవి, సీతారామయ్యలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పాలేటిగంగ శిల్పాన్ని సంరక్షించుకోవాలి

చరిత్ర పరిశోధకులు ఈమని శివనాగిరెడ్డి, జ్యోతిచంద్రమౌళి



విజయవాడ/ఒంగోలు/కనిగిరి: ప్రకాశం జిల్లా పీసీ పల్లె మండలం, పెద ఆలవులపాడు శివారున పాలేరు నది ఒడ్డున పాలేటిగంగ గా పిలిచే వెయ్యేళ్లనాటి మహిషాసురమర్ధని శిల్పాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో, డా.ఈమని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ప్రకాశంజిల్లా చరిత్ర పరిశోధకుడు, విద్వాన్ డా. జ్యోతిచంద్రమౌళి ఇచ్చిన సమాచారం మేరకు ఆయన ఆదివారం నాడు ఆ శిల్పాన్ని పరిశీలించారు. కాటమరాజుకథలోని గ్రామాల సందర్శనలో భాగంగా మనుమసిద్ధి సైన్యాధ్యక్షుల మధ్య జరిగిన యుద్ధ ప్రదేశాలైన ఎర్రగడ్డపాడు, లింగాలకొండ, పెదఆలవులపాడు, పాలేటిగంగ ప్రాంతాల్లో శివనాగిరెడ్డి, జ్యోతిచంద్రమౌళి, కాటమరాజు విస్తృతంగా పర్యటించారు. చారిత్రక ఆనవాళ్లయిన శిథిలఆలయాలు, విరిగిన శిల్పాలు, చెరిగిపోయిన శాసనాలను పునఃపరిశీలించి, ఆసక్తికర చారిత్రక విషయాలను వెల్లడించారు. పాలేటికి కుడివైపు ఒడ్డునున్న ఒక గుండుపై నాలుగున్నర అడుగుల ఎత్తు, రెండున్నర అడుగుల వెడల్పు, మూడు అంగుళాల ఉబ్బెత్తుగా చెక్కి ఉన్న మహిషాసురమర్ధని విగ్రహం గురించి వివస్తూ... తూర్పు చాళుక్యుల నాటి (క్రీ.శ.10వ శతాబ్ది) ప్రతిమా లక్షణంతో ఉన్న ఈ విగ్రహాన్ని విష్ణు - దుర్గ అని కూడ పిలుస్తారని శివనాగిరెడ్డి చెప్పారు. ప్రకాశం జిల్లా చరిత్ర, శాసనాలపై విస్తృత పరిశోధనలు చేసిన డా.జ్యోతిచంద్రమౌళి, ఆ విగ్రహం పక్కన మరో గుండుపై చెక్కిన క్రీ.శ.1526 సం॥ తెలుగు శాసనంలో రావురి రాఘవరెడ్డి తన తల్లిదండ్రుల స్మారకార్థం... లింగాలకొండ సోమేశ్వరునికి, బగాది గంగమ్మ షోడశోపచారాలకు కనిగిరి-పోలచెర్ల ముసుండూరి సీమలోని గంగపట్నాన్ని దానం చేసిన వివరాలున్నాయని తెలిపారు. ఏటా జరిపే జాతర సందర్భంగా చరిత్రపై అవగాహన లేని స్థానికులు గుండుకు, ఆ విగ్రహానికి రకరకాల రంగులు వేయటం వల్ల చారిత్రక ఆనవాళ్లకు హాని కలుగుతుందని చెప్పారు. ఆలనాపాలనా లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్న పురావస్తు ప్రాధాన్యతగల అరుదైన ఈ విగ్రహాన్ని కాపాడి, భవిష్యత్ తరాలకు అందించాలని, దీనిని పరిరక్షించటానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందిస్తామని శివనాగిరెడ్డి, జ్యోతిచంద్రమౌళి ఆలవులపాడు గ్రామస్తులకు విజ్ఞప్తి చేయగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరికి చెందిన చరిత్ర ఔత్సాహికుడు కరుణానిధి పాల్గొన్నారు.

వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శికి ఆదివారం ఆయన లేఖ రాశారు. ఐదు జిల్లా ఆసుపత్రుల (మచిలీపట్నం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం)ను సర్వజన ఆస్పత్రులుగా ఉన్నతీకరించి వైద్య కళాశాలలు మంజూరు చేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అయితే వైద్య కళాశాలగాను, సర్వజన ఆసుపత్రి గాను కొత్త పోస్టులను మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న వైద్య సిబ్బందిని, వైద్య విద్య విభాగంలోకి ఐచ్ఛికంగా తీసుకుని వారిని విలీనం చేయాలన్నారు. గతంలో నెల్లూరు, కడప, ఒంగోలు, శ్రీకాకుళం జిల్లా ఆస్పత్రులను వైద్య విద్యా విభాగంలో కలిపినప్పుడు, వారిని అక్కడ పని చేస్తున్న సిబ్బందిని విలీనం చేసుకున్నారని వివరించారు. విలీనమైన ఐదు జిల్లా ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందిని, వైద్య విద్యా సంచాలకుల పరిధిలోకి తీసుకుంటారా?, లేదా ? తెలపాలన్నారు. ప్రస్తుతం అక్కడ పని చేయు సిబ్బందిని, సర్వజన ఆస్పత్రిలోకి విలీనం చేసుకోవాలని, లేకుంటే భవిష్యత్తు ఆందోళన కార్యక్రమాలకు వెనుకాడబోమని హెచ్చరించారు. వైద్యవిధాన పరిషత్ నందు కమ్యూనిటీ ఆస్పత్రులను, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో ఉన్న బెడ్లకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్య పెంచాలని, ఎలాంటి పదోన్నతి లేని ఉద్యోగులకు ల్యాబ్ సిబ్బందికి ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-1 ప్రతి జిల్లా, ఏరియా ఆసుపత్రిలో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంజూరు చేయాలన్నారు. చీఫ్ రేడియో గ్రాఫర్ పోస్టులను ప్రతి జిల్లా ఆస్పత్రిలోమంజూరు చేయాలని, ప్రతి ఏరియా ఆస్పత్రిల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు ఆస్పత్రిలో విడతల వారీగా విధులను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సమస్యల్ని పరిష్కరించుకుంటే ఆందోళనలు చేపడతామన్నారు.

అల్లూరికి ఘన నివాళి...

రెడ్డిగూడెంలో భారీ ర్యాలీ

విశాలాంధ్ర-రెడ్డిగూడెం: స్వాతంత్ర సమరయోధుడు, మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని సీపీఐ అధ్వర్యాన ఆదివారం రెడ్డిగూడెంలో ఘనంగా నిర్వహించారు. రెడ్డిగూడెం పరిధిలోని మిట్టగూడెం పవన్ గార్డెన్స్ నుంచి వందలాది మంది భారీ ర్యాలీగా గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలికి చేరుకున్నారు. అక్కడ అల్లూరి చిత్రపటానికి సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. అల్లూరి పోరాట స్ఫూర్తిని నేటి తరం అందిపుచ్చుకుని బీజేపీ అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, మతోన్మాద విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తూము కృష్ణ, మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుద్ది రమేశ్, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, సీపీఐ రెడ్డిగూడెం, జి.కొండూరు, మైలవరం మండలాల కార్యదర్శులు అడపా సుబ్బారావు, గూడూరు శ్రీనివాసరెడ్డి, పీవీఎల్ గణేశ్వరమ్మ, ఇబ్రహీంపట్నం మండల సహాయ కార్యదర్శి జి.రాము, చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు, వందలాది మంది సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరి స్మారక కేంద్రాలు అభివృద్ధి చేయాలి

ముఖ్యమంత్రికి సీపీఎం నేత శ్రీనివాసరావు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అల్లూరి సీతారామరాజు స్మారక కేంద్రాలను అభివృద్ధి చేయాలని, పోలవరం ప్రాజెక్టుకు అల్లూరి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు ఆదివారం ఆయన లేఖ రాశారు. విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జన్మించిన పాండ్రంగి (విశాఖ జిల్లా), సమాధి చేయబడ్డ కృష్ణదేవిపేట (అనకాపల్లి జిల్లా) గ్రామాలను ఈనెల రెండో తేదీన సీపీఎం కార్యకర్తలు, స్థానిక గ్రామ పెద్దలతో కలిసి తాను సందర్శించానని వివరించారు. అల్లూరి స్ఫూర్తి యువతరంపై ప్రగాఢంగా ఉందనీ, దానికనుగుణంగా వారి జ్ఞాపక చిహ్నాలను భద్రపర్చడం లేదన్నారు.

ఇప్పటికే వివిధ సీజన్లలో నలుగురైదుగురు మరణించినట్లుగా గ్రామస్తులు తెలిపారనీ, ఆయన జన్మించిన గృహంలో రెండు విగ్రహాలు తప్ప మరేమీ లేవని పేర్కొన్నారు. కృష్ణదేవీపేట సమాధుల ప్రాంతాన్ని స్వచ్ఛంధ సంస్థలు, చాలా సంఘాలు, వ్యక్తులు శ్రద్ధ తీసుకొని పార్కుని అభివృద్ధి చేశారనీ, దాని నిర్వహణకు ప్రభుత్వం బాధ్యత తీసుకోకపోవడం విచారకరమన్నారు. తెలుగుజాతి గర్వించదగిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెల 4న ఘనంగా నిర్వహించబోతున్నాయని, ఆ స్ఫూర్తికి తగిన విధంగా అక్కడ స్మారక కేంద్రాలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ నేత నారాయణను పరామర్శించిన చంద్రబాబు

హైదరాబాద్: సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణను టీడీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణ స్వగృహానికి చేరుకున్న చంద్రబాబు ఇటీవల కన్ను మూసిన నారాయణ సతీమణి వసుమతి దేవి చిత్రపటానికి నివాళి అర్పించారు. వసుమతి దేవి అకాల మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. నారాయణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ కుమార్తె స్పందన, కుమారుడు ధీరజ్‌లకు ధైర్యం చెప్పారు.

సభ్యత్వం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఏపీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదుకు శ్రీకారం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు ప్రారంభించారు. ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంబటి మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజులపాటు జరుగుతుందని తెలిపారు. రెన్యువల్‌కు రూ.150/-, నూతన సభ్యత్వానికి రూ. 250/- కట్టాల్సి ఉంటుందన్నారు. సభ్యత్వ నమోదు అనంతరం దరఖాస్తులను కమిటీ ద్వారా పరిశీలించి కార్మిక శాఖకు అందజేస్తామన్నారు. అనంతరం దశల వారీగా జిల్లా, రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. విజయవాడ అర్బన్ యూనిట్ కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మరాజు చలపతిరావు, ఆర్ వసంత్, సీనియర్ జర్నలిస్టు నాయకులు షేక్ బాబు, దారం వెంకటేశ్వరరావు, జీ రామారావు, దాసరి నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ సాంబశివరావు, విజయవాడ అర్బన్ యూనియన్ కార్యవర్గ సభ్యులు, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీకి వైసీపీ ప్రమాదకరం: పవన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు వైసీపీ ప్రమాదకరమని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. జనవాణి అనంతరం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య(ఎంబీవీకే)లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి బలమైన నేతల సమూహం ఉంటే తప్ప, సమస్యల వలయం నుంచి బయటకు తీసుకురాలేమన్నారు. ఆ బాధ్యతను జనసేన తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో వైసీపీ పాలన నుంచి బయటపడవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏ ఒక్కరితోనో రాష్ట్రం బాగుపడుతుందని తాను ఆశించడం లేదన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగాల్లేవని చెప్పారు. ప్రజాప్రతిధులకు బూతులు మాట్లాడానికైతే సమయం దొరుకుతోందని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించడం లేదన్నారు. తారతమ్యాలు లేకుండా, సగటు మనిషి పక్షాన నిలబడాలన్న ఉద్దేశంతోనే జనవాణి ప్రారంభించినట్లు వివరించారు. తమకు వచ్చిన ఫిర్యాదుల్లో అధికంగా విదేశీ విద్యా పథకం, రైతులకు గిట్టుబాటు ధర, టిడ్కో ఇళ్లు, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్యా పథకంతోపాటు చాలా అంశాలపై ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఆయా ప్రజా సమస్యల్ని పరిష్కరించే అధికారం తమకు లేకపోయినా, వాటిని ఎక్కువ మందికి చేరవేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తాను సీఎంను కాదనీ, సగటు మనిషిని అని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ ముందుకు పోతోందేగానీ, ప్రజా సమస్యల్ని ఎలా పరిష్కరించాలన్న ఆలోచించడం లేదని మండిపడ్డారు. ప్రజల కోసమే జనసేన నిలబడుతుందని, బాధ్యతతో పనిచేస్తామన్నారు. ఆజాదీ అమృత్ మహోత్సవాల సందర్భంగా భీమవరంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు వస్తున్న ప్రధాని మోదీకి జనసేన తరపున స్వాగతం పలికారు. అజాద్ అమృత్ మహోత్సవ్‌కు తనకూ ప్రత్యేకంగా ఆహ్వానం పంపినందుకు ధన్యవాదాలు తెలిపారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు.

సీఐడీ వేధింపులు ఆపండి

డీజీపీకి చంద్రబాబు లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేవారిపై సీఐడీ వేధింపులకు పాల్పడుతోందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు ధ్వజమెత్తారు. ఈ మేరకు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డికి ఆదివారం ఆయన లేఖ రాశారు. టీడీపీ కార్యకర్తలు గార్లపాటి వెంకటేశ్వరరావు, మోకర్ల సాంబశివరావులను సీఐడీ అధికారులు అక్రమంగా అదుపులోకి తీసుకుని వేధించారని మండిపడ్డారు. అర్ధరాత్రి తలుపులు పగలగొట్టి నోటీసుల పేరుతో వేధింపులకు పాల్పడ్డారన్నారు. ఇంట్లోకి చొరబడి కుటుంబీకులను భయభ్రాంతులకు గురిచేశారని, స్టేషన్‌లో బట్టలు లేకుండా కూర్చోబెట్టి దాడికి పాల్పడటం దారుణమని ఖండించారు. విచారణ సమయంలో గదిలో ఎలాంటి సీసీ కెమేరాలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా సీఐడీ అధికారులు వ్యవహరించారని, ప్రతిపక్షాలను ప్రభుత్వం రాజకీయ వేధింపులకు గురిచేస్తోందన్నారు. టీడీపీ శ్రేణులపై బెదిరింపు చర్యలకు దిగుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ కార్యకర్తలను అక్రమంగా అదుపులోకి తీసుకుని, చిత్రహింసలు పెట్టాల్సిన అవసరం సీఐడీకి ఏముందని ప్రశ్నించారు. కుట్రలకు పాల్పడిన సీఐడీ అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధితులకు డీజీపీ అండగా నిలబడాలని చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు.

ముగిసిన జగన్ విదేశీ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ విదేశీ పర్యటన ముగించుకుని ఏపీకి చేరుకున్నారు. ఆదివారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సీఎం జగన్‌కు మంత్రి జోగి రమేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ తదితరులు స్వాగతం పలికారు. జూన్ 28వ తేదీన సీఎం జగన్ పారిస్‌కు బయల్దేరి వెళ్లిన విషయం విదితమే. అక్కడ తన కుమార్తె హర్ష గ్రాడ్యుయేషన్ కాన్వొకేషన్ వేడుకల్లో పాల్గొన్నారు. తిరిగి ఈనెల 2న సాయంత్రం 4 గంటలకు పారిస్‌లో బయలుదేరి ఆదివారం గన్నవరానికి చేరుకున్నారు. సీఎం కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తదితరులు సీఎంను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

టయోటా అర్బన్ క్రూజర్ హైరైడర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎమ్) మొట్టమొదటి సెల్ఫ్ చార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎస్యూవీని ఆవిష్కరించినట్లు కిర్లోస్కర్ మోటార్ వైస్ చైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిని అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారన్నారు. టయోటా ఎల్లప్పుడూ ప్రకృతితో సామరస్యంగా జీవిస్తూ సుస్థిర సమాజాన్ని నిర్మించుకోవాలనే దృఢమైన నిబద్ధతతోనే నడుస్తుందని వివరించారు. తక్కువ కార్బన్ శక్తి వనరుల వైపు మళ్లడం, ఆచరణాత్మక, స్థిరమైన మొబిలిటీ పరిష్కారాలను అందించడమే లక్ష్యంగా దీనిని ఆవిష్కరించామని తెలిపారు.

అందిద్దాం తీస్తాకి స్నేహ హస్తం

తీస్తా అనేది నీ పేరు,పేరు ఏదైతేనేమీ
పుట్టావు నీవు సిక్కింలోనో, గుజరాత్ లోనో



ఉరకలెత్తే నీ ప్రవాహం ఆశను రేకెత్తిస్తోంది.
నీ ఉదాత్తతతో వేలాది కుటుంబాలు వెలుగు నింపుకున్నాయి.
వేయి తుపాన్లను గుండెలో దాచుకొని
వేలాది అడ్డంకులను దాటుకొని
అప్పుడప్పుడు ప్రవాహమార్గాన్ని మార్చుకుంటూ
బండరాళ్లను, ఇసుకదిబ్బలనూ చీల్చుకుంటూ ముందుకు పోతావు.
నర్మద రక్తంతో ఎరుపెక్కినప్పుడు
దాని గట్లపై మాంసం కంపు కొడుతున్నపుడు
జకియా ఏకాకిగా విలపిస్తోంది
బిల్కీస్ నైతే ముక్కలు ముక్కలుగా నరికేశారు.
ఆశావహ దృక్పథంతో, బలంగా ముందుకు సాగటాన్నే ఎంచుకున్నావు.
వారికోసం ముందుకు నడిచావు, మా కోసమూ నిలబడ్డావు
ఇంకా ఎన్ని మైళ్ళున్నానడుస్తావు
జైలులోని చీకటిగది వెలుతురును మింగగలదా?
మరలా ప్రవహిస్తావు నీవు
ఈ నేలపైన, కొండల మధ్య నుండి
నీవొక నదివి
పేరుకు మాత్రమే కాదు.

ఇంగ్లీషు: మౌమితా ఆలం
తెలుగు: కొత్తపల్లి రవిబాబు, 9490196890

సాహితి

సామాజిక చైతన్య దీప్తి వేమన కవిత్వం

డా॥ తక్కోలు మాచిరెడ్డి, సెల్: 9666626546

ప్రముఖ విద్వాంసుడు, విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి తన 'కవిత్వ తత్వ విచారము' లో వేమనను గురించి రాస్తూ ఇలా అన్నాడు. "వేమనకు పుస్తక జ్ఞానం ఇంచుమించు సున్న/ వ్యాకరణము, ఛందస్సు, అలంకార శాస్త్రము మొదలగు వానిలో ఆసక్తి ఎంత తక్కువో, భక్తియు నంత తక్కువ/ అట్లుండినను వేమన మహాకవులలో జేరిన వాడని చెప్పుటకయి, సామాన్య మయిన శుష్క పండితులు తప్ప, ఇంకెవరును సందియపడరు".

వేమన పద్యాలను సేకరించడంలోను, వివిధ భాషల్లోకి అనువాదం చేయడంలోను, పాశ్చాత్యుల కృషి ప్రశంసనీయం. తాళపత్ర గ్రంథాలలోని వేమన పద్యాలను సేకరించి ఆంగ్లంలోకి అనువదించి ప్రచురించిన ప్రముఖుల్లో మొదటివాడు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 1829 లో 693 వేమన పద్యాలను ఇంగ్లీషు అనువాదంతో సహా ప్రచురించినాడు. 1839 లో ఈయనే మరికొన్నిపద్యాలను చేర్చి 1200పద్యాలను ద్వితీయముద్రణలో ప్రచురించాడు. ఫ్రెంచి మత గురువు దూబాయ్, దేవిడ్ బార్నెట్, గ్రియర్సన్ కొన్ని వేమన పద్యాలను ఫ్రెంచి, లాటిన్‌భాషల్లోకి అనువాదం చేశారు. వేమన అంతర్జాతీయ వాది, మానవతావాది. కులాన్ని నిరసిస్తారు. వేమన పంక్తుల్లో- ఉర్వి వారికెల్ల నొక్క కంచము బెట్టి/ పొత్తు గుడిపి కులము బొలయజేసి తలను చేయిపెట్టి తగనమ్మ జెప్పరా/ విశ్వదాభిరామ వినురవేమ!

ప్రపంచ ప్రజలందరినీ ఒకచోట చేర్చి, ఒక కంచముబెట్టి కులభేదం లేకుండా ప్రమాణం చేయించండని ఉద్బోధిస్తాడు వేమన. ఇంత విశాల దృక్పథంకలిగిన వేమన సామాజిక దురాచారాల్ని, చైతన్యవంతంగా నిరసిస్తాడు/ తీర్థస్థానాల్లో తల గొరిగించుకునే వారి మీద చురకవేస్తూ వేమన అంటాడు:

సకల తీర్థములను సకల యజ్ఞంబుల/ తలలు గొరిగించుకున్న ఫలము గలదె/ మంత్ర జలము కంటే మంగలి జలమెచ్చు..విశ్వదాభిరామ వినురవేమ! కుల వ్యవస్థ కూలి పోవాలని వేమన అన్ని కులాలు సమానం అని అంటాడు. కుల వ్యవస్థ సృష్టించే దొంతరల సమాజ వ్యవస్థను ఈసడించుకుంటాడు. రాజ్యాంగంలో చేర్చబడిన షెడ్యూల్ కులాల ఔన్నత్యాన్ని విశదీకరిస్తాడు వేమన ఇలా- మాదిగ అనగానే మరి తక్కువందురు/ మాదిగ యిలసురల మాకు గాదె/ మాదిగకును బిడ్డ మన యరుంధతి గాదె- విశ్వదాభిరామ! వినురవేమ/ ఇల సురలు అంటే బ్రాహ్మణులు సప్త ఋషులలో ఒకడైన వశిష్ఠుని భార్యే గదా మన సతీ అరుంధతి అని అంటారు సగర్వంగా ఆ కులం వారు. సర్వ జనులూ సమానమే అనే వేమన కులం ఆధారంగా ఎవరినీ నిందించకూడదని ఉపదేశిస్తాడు ఇలా- మాలవాని నేల మహిమీద నిందింప? ఒడల రక్త మాంస మొకటి కాదె, వానిలోన వెలుగు వాని కులంబేది? అని ప్రశ్న సంధిస్తాడు వేమన. కర్మచేత మాలలౌతారు గాని, జన్మ చేత కాదు అంటాడు ఆయన. అంటరానితనాన్ని నిరసిస్తాడు -దాన్ని పాటించే వారిని నర పశువులు అంటాడు- మాలయటంచున మఱి నీళ్ల మునిగిరి మా కర్మచేత మాలడాయె/ నేల తెలియరో యీ నర పశువులు?



మనిషే దైవం అని ఒక పద్యంలో ప్రకటిస్తాడు వేమన. ఆత్మయందె తలపు ననువుగా నొనరించి/ నిశ్చలముగ దృష్టి నిలిపెనేని/ అతడు నీవే సుమ్మి అనుమానమేలరా? అంటే, ఆత్మను కేంద్రంచేసుకొని దానిపై నిశ్చలమైన దృష్టినిలుపుకొని, మెసలు వాడు దైవమే సుమా- నిస్సందేహంగా దైవమే/ మాయావాదాన్ని, మిథ్యావాదాన్ని కొట్టి పారేస్తాడు వేమన- మాయ జగమంచు మనుజులు సెప్పిరి/ మాయగాదు కర్మమయముగాని/ మాయ యైన జగము మఱి యేడ నున్నచో- విశ్వదాభిరామ! వినురవేమ! 'బయలు' అనే ఓ మామూలు పదాన్ని విశేషమైన సందర్భంలో వాడుతాడు/ బయలు అంటే, విశ్వం, అంతరిక్షం అని భావించవచ్చునేమో అన్పిస్తుంది/ ఠాగూరు లాగే, బయలున బంధము పుట్టును, పరమాత్మకును బంధము కలుగును అంటాడు వేమన/ ఠాగూర్‌లాగే తనలోనే బ్రహ్మం అంటాడు వేమన.

విశ్వమందు బ్రహ్మ విస్తరించుట గాక/ వారె బ్రహ్మమనుచు వెదకనేల? తగిలి యుండుగాదె తనలోన బ్రహ్మంచు/ బయలులోనే సమస్తమూ అంటూ- బయలందె పుట్టును సర్వము / బయలందే లీనమగును బ్రహ్మాండంచుల్/ బయలని మదిలో తెలిసిన/ బయలదే ముక్తి బట్టబయలగు వేమా! పగలు, రేయి మఱిచి, జ్ఞానసుధా ప్రవాహములో తేలియాలలాడుచూ, అతను, నేను వేరనే సంగతి మరచిన వాడే ఉత్తమ యోగి అంటాడు వేమన/ పగలు రేయి మఱచి! భావంబు మరచియు/ తాను నేనని యెది తలపు మరిచి/ యుండు వాని నుంచ! ఉత్తమ యోగిరా! కుల వాదాన్నీ కాదు, వేమన మతాలను కూడా లెక్కచేయడు- మతాల వలన గుందరగోళం ఏర్పడుతుందని వాటిని నిరసిస్తాడు. ఇలా-మర్మ మెరుగలేక మతములగల్పించి/ యుర్విజనులు దుఃఖ మొందుచుంద్రు/ గాజుటింటి కుక్క కళవళపడురీతి/ కుక్క అద్దాల యింటిలో తన ప్రతిబింబము చూచి భ్రమించి మరియొక కుక్క వచ్చిందని కళవెళపడు తుంది/ 'మర్మం' తెలుసుకోకుండా అనేక మతాలు వెలసినాయి అని భావన/

నరుడు పుట్టేపుడు ఏమీ తేడు, చచ్చేప్పుడు ఏమీ తీసుకుపోడు- భౌతిక సంపత్తి తన వెంట రాదు/ ధనము ఎందుకూ పనికి రాదు/ వేమన మాటల్లో- ఏమి గొంచు వచ్చెనేమి తా గొని పోవు/ పుట్టు వేళ నరుడు గిట్టువేళ? ధనము లెచటికేగు? తానేగు నెచటికి? కొన్ని మానసిక ధోరణులను ముఖ్యంగా కోపములాంటి వాటి చేత కలుగు హానిని విశదీకరిస్తు వేమన- అతి సరళమైన భాషలో కోపమునను ఘనత కొంచెమైపోవును /కోపమునను గుణము కొఱత పడును/ కోపమునను బతుకు కొంచెమై పోవును- శత్రువును కూడా చంప కూడదు, వీలైతే తగిన మేలు చేయాలి అతనికి అని వేమన అభిమతం/ ఆయన మాటల్లో- చంపదగిన యట్టి శత్రువు తనచేత/ చిక్కెనేని కీడు సేయరాదు/ పొసగ మేలుచేసి పొమ్మనుటె మేలు- ఒక మంచి ఉపమానంతో ఇల్లాలిని వదిలి వేరే స్త్రీతో సంబంధం పెట్టుకునే వారి మీద, వేమన వేసిన చురక చూడండి- ఇంటి యాలి విడిచి యిలఁ జారకాంతల/ వెంట తిరుగు వాడు వెర్రివాడు/ పంటచేను విడిచి పరిగ నేరిన యట్లు/ పంటచేనులోని పంటను వదలి, రాలిన పరిగను ఏరినట్లుంది పురుషుని ఈ వాలకం అని అంటాడు.

వేమన దాదాపు ప్రతి పద్యంలోనూ ఒక ఉపమానం ఉంటుంది/ ఎర్రగడ్డల తోటలో మల్లిమొక్క తన సువాసనను కోల్పోయినట్లే/ దుర్జన సాంగత్యం చేసిన సజ్జనుడు నీతి కోల్పోతాడు/ వేమన మాటల్లో- టక్కరులను గూడి యెకసక్కెములాడ నిక్కమైన ఘనుని నీతి చెడును/ ఉల్లి తోటం బెరుగు మల్లిమొక్క కరణి/ అలాగే మరో ఉపమాలంకారం చూడండి- ప్రసిద్ధ పద్యంలో అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను/ సజ్జనుండు బల్కు చల్లగాను/ కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా? వేమన రైతు కుటుంబంలో పుట్టినాడు. అతని కవితలో వ్యవసాయ సంబంధమైన ఉపమానాలు మెండు. ఒక్క చెఱకు గడయందు వెన్ను పుట్టితే, చెరకు గడ కంతయు తీపి తగ్గునని తోటనంతా కొట్టి వేస్తాడు. సమాజంలో ఒక గుణహీనుడుంటే, అది ఆ సమాజమంతటికీ చెరుపే. ఆయన మాటల్లోనే- కులములోన నొకడు గుణ హీనుడుండెనా/ కులము చెడును వాని గుణము వలన / వెలయు చెఱకునందు వెన్నుపుట్టిన రీతి/ ఆత్మజ్ఞానమే బ్రహ్మ జ్ఞాన మంటూ- వేమన- బ్రహ్మమనగ వేరె పర దేశంబున లేదు/ బ్రహ్మ మనగ తాను బట్టబయలు/ తన్ను తానెరిగిన తానెపో బ్రహ్మంబు/ ఈ పద్యం వేమన విశ్వవిద్యాలయం నీతి వాక్యమై పలువురి మనసులను స్పృశిస్తోంది- ఆత్మ విశ్వాసాన్ని పెంచుతోంది.

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ వేమన తనకు రావలసినంత పేరు సంపాదించు కోని మహాకవి అంటూ వేమనను గురించి అన్నాడు. అప్పుడేమో గాని, ఇపుడు ఆయనపేరుతో కడపలో ఓ విశ్వవిద్యాలయమే వెలసిఉంది. వేమనపై పరిశోధించిన వారిలో ప్రముఖులు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, చిలుకూరి వీరభద్రరావు, వేటూరు ప్రభాకరశాస్త్రి, డా॥గోపి, రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ- వేమనపై శర్మగారి ఉపన్యాసాలు ప్రసిద్ధం. ఇకపోతే వేమన పద్యాల సంఖ్య- నికరంగా తేలినవి 1200-1500 మధ్య వేమన కూర్చొని రాసిన పద్యాలు తక్కువ- ఎక్కువ భాగం ఆశువుగా చెప్పినవే- అవి విన్నవారు రాసిపెట్టినవి కొన్ని కాగా, కంఠస్తం చేసిన వారు మరికొందరు అందుకే ఎన్నో పాఠాంతరాలు/ వేమనవే మరికొన్ని పద్యాలు చూద్దాం.

కసవు తినును గాదె పసరంబులెపుడు/ చెప్పినట్లు వినుచు చేయు పనులు/ వాని సాటియైన మానవుడొప్పడా? జ్ఞానము లేక, గడ్డి తినెడి పశువు చెప్పినట్లు వినుచు పనులు చేయును/ జ్ఞానము గల మానవుడు ఆ పశువు పాటియైనను చేయవలదా? మూర్ఖులు ఈ పశువుల కన్నా బుద్ధి తక్కువగా ప్రవర్తింతురు/ ఎవరు చెప్పినా వినరు/ మరో ఉపమానంతో మూర్ఖుల కెంత హితబోధ చేసినా ఫలితముండదు/ పొట్లకాయకు రాయి ముడివేసి తాడుతో కట్టినచో అది వంకర లేకుండా అందంగా చక్కగా పెరుగుతుంది. కాని కుక్క తోకకు బద్దలు వేసి కట్టినా వంకర లేకుండా పోదు. మూర్ఖులెంత చెప్పినా బాగుపడరు. వేమన పంక్తులు-పొట్లకాయ రాయి పొదిగి త్రాటను గట్టి/ లీలతోడ వంకలేక మెఱుగు/ కుక్కతోక కట్ట చక్కగా వచ్చునా? ధనార్జన కోసం తిరిగితే మోక్షం రాదు అంటూ కాసులకును తిరుగ కలుగునా మోక్షంబు అని అవహేళన చేస్తాడు. ధన స్వామ్యాన్ని నిరసిస్తూ కులము గలవారు, గోత్రము గలవారు విద్య చేత విర్రవీగువారు/ పసిడి గల్గువాని బానిస కొడుకులు అంటూ మరియు, పుత్తడి గలవాని పుండు బాధయు కూడా వార్తకెక్కు/ పేదవాని యింట పెండ్లైన యెవ్వరికీ తెలియదు/ కులం కాదు, గుణమే ప్రధానమంటూ వేమన- రామనామ పఠనచే మహి వాల్మీకి/ పాపి బోయడయ్యు బాపడయ్యె/కులము ఘనము కాదు గుణమే ప్రధానము/

వ్రతములు పాటించినంత మాత్రం చేత దుర్గుణాలు పోవని ఒక పద్యంలో బలంగా చెబుతాడు ఓ ఉపమానంతో- దశమి యేకాదశియని వ్రతముల బూని/ మెతుకు తినకున్న దుర్గుణమది యడంగునె? పుట్టపై గొట్ట ఉరగంచు గిట్టబోదు/ తీరెఱుంగని మౌఢ్యమీ తెఱగ వేమ! పామును గుర్తించక పుట్టమీద కొట్టినంత మాత్రమున పాము చావదు/ అట్లే దుర్గుణముల నణచవలెనని దశమి, యేకాదశి అనే వ్రతముల బూని అన్నము తినకున్నంత మాత్రమున దుర్గుణములు తగ్గవు/ తగ్గునని అనుకోవడం అవగాహన లేని మూర్ఖత్వాలు. అవగాహన పెంచుకోవాలే గాని ఉపవాస వ్రతములు ఆచరించినంత మాత్రమున దుర్గుణాలు పోవు అని వేమన ఉపదేశం. ఇలా నలుదెసలా సామాజిక చైతన్య దీప్తి ప్రసరింపజేసిన మహనీయుడు వేమన. ప్రఖ్యాత బాంగ్లా రచయిత బినయ్ కుమార్ సర్కార్ ప్రకారం తమిళ కవి తిరువళ్లువర్ రాసిన తిరుక్కురళ్ (సూక్తులు)నందలి భక్తి పారవశ్యము, సమతా భావములను విప్లవ సీమా పరిసరములకు కొనిపోయినాడు వేమన. ఇది సత్యం.

ఇక, ఒకమాట మకుటం గురించి విశ్వదాభిరామ వినురవేమ అంటే, విశ్వ- సమస్తమును, ద- ఇచ్చుటతో అభిరాముడు- మనోజ్ఞమైనవాడు వేమన అని అర్థం. ఆఁ, అసలు విషయమేమిటంటే, వేమన కులాన్ని నిరసించినా, అతను పుట్టింది కాపుకులంలో అంటే రెడ్లకులంలో రాయలసీమలో పుట్టి పెరిగాడు, తిరిగాడు. వేమన 17వ శతాబ్దంవాడని విద్వాంసులు, పరి శోధకులు తేల్చారు. కటారుపల్లెలో వేమన సమాధి ఉంది.

నవ్వుల చిరుజల్లులు కురిపించే 'చంద్రహాసం'

గ్రంథ సమీక్ష

మనుషులు హాయిగా నవ్వుకుని ఎన్ని రోజులైందో.. ఎవర్ని చూసినా అసంతృప్తి, విసుగు, చిరాకు.. జీవితగమనంలో ఎన్నిటిని స్వంతం చేసుకున్నా ఇంకా అందనివాటిని అందుకోవాలన్న ఆరాటంలో మనిషి నవ్వుని మర్చిపోయాడు. కొన్ని దశాబ్దాల క్రితం కుటుంబ సభ్యులు ఒక చోట చేరి, హాయిగా కబుర్లు చెప్పుకుంటూ, చెణుకులు విసురుకుంటూ, మనసారా నవ్వుకుంటూ.. ఇడియట్ బాక్స్ వచ్చి జీవితంలోని సగం సరదాల్ని మింగేస్తే, సెల్‌ఫోన్ వచ్చాక మిగతా అన్నిటినీ స్వాహా చేసింది. ఎడారిలో ఒంటరి ప్రయాణం లాంటి నేటి జీవితంలో చిరుజల్లులా సేద తీర్చడానికి అడపాదడపా హాస్య రచనలు రావడం స్వాగతించదగిన విషయం. అలా నవ్వుల పువ్వుల్ని కురిపించి, వెన్నెల హాసాన్ని పాఠకులమీద చిలకరించడానికి శ్రీ చంద్రప్రతాప్ కంతేటి పూనుకుని వెలువరించిన పుస్తకమే 'చంద్రహాసం'.

చంద్రప్రతాప్ జగమెరిగిన సాహితీవేత్త. కొన్ని దశాబ్దాలపాటు విపుల, చతుర మాసపత్రికలకు సంపాదకులుగా పనిచేసిన అనుభవం అదనపు అర్హత.. కాబట్టే ఏది రాసినా అది ఉత్తమ సాహితీవిలువల్తో పరిపుష్టమై ఉంటుంది. రచయిత తన ముందు మాటలో చెప్పినట్టు హాస్యం రాయడం కత్తిమీద సాము లాంటిదే. వేయాల్సిన దినుసుల్లో కొద్దిగా తేడా వచ్చినా హాస్యం కాస్తా అపహాస్యంగా మారే ప్రమాదంఉంది. హాస్యం రాసి విజయం సాధించాలనుకోవడం సాహసమే. చంద్రహాసం పుస్తకంలోని 45 ఖండికలను చదివాక, చంద్రప్రతాప్ హాస్యం, వ్యంగ్యం రాయడంలో విజయశిఖరాలు అధిరోహించారని ఒప్పుకోక తప్పదు. కొన్ని ఖండికలు సుతిమెత్తగా చక్కిలిగిలి పెట్టినట్టు నవ్విస్తే మరికొన్నిటిలో సమాజంలోని పోకడల మీద వ్యంగాస్త్రాలను సంధించి, వాటి గురించి ఆలోచింపచేసేలా రాశారు.



దిల్‌సుఖ్‌నగర్ వెళ్ళాల్సిన సదానందం సికింద్రాబాద్ బస్ కోసమో ఉప్పల్ బస్ కోసమో ఎదురు చూస్తున్నట్టు ఎందుకు నటిస్తాడో తెలియాలంటే 'బ్రహ్మ కడిగిన పాదమూ' అనే ఖండిక చదవాల్సిందే. చలపాయ్ తీరు మరో రకం. హౌసింగ్ బోర్డ్‌కి టికెట్ తీసుకున్నా, కండక్టర్‌తో పోట్లాడి మరీ చందానగర్ దాకా వెళ్ళి, అక్కడ బస్‌దిగి, వెనక్కి వచ్చేంత మొండితనం. అందుక్కారణం ఏమిటో తెలిస్తే ముసిముసి నవ్వులు ముసురుకోక తప్పదు. పుత్రపౌత్ర ప్రాప్తిరస్తు అని పెళ్ళిళ్ళలో దీవిస్తే జగన్నాథం ఎందుకు మండిపడతాడో తెల్సుకున్నాక గుండె బరువెక్కుతుంది.

పిల్లికి బిచ్చం వేయని శ్రీపాదం.. అరకప్పు టీ ఇప్పించడానికి శిబి చక్రవర్తిలా ఫీలయ్యే శ్రీపాదం తన కొత్త కారులో రౌండ్ వేయడానికి ముగ్గురు స్నేహితుల్ని పిలవడంలో అంతరార్థమేమిటో అర్థం కాగానే కిసుక్కున నవ్వుకుంటాం. 'మనవన్నీ వాట్సాప్ బంధాలే. అయినదానికీ కానిదానికీ 'మా యింట్లో కుక్కపిల్ల,' 'బాల్కనీలో రెట్ట వేస్తున్న పిట్ట' అంటూ పిచ్చి ఫోటోలతో మన ఇన్బాక్సలన్నీ నింపి పెట్టే మనుషులకు ముఖ్యమైన విషయాల పట్ల ఎందుకింత నిర్లక్ష్యమో అర్థం కాదు' అంటూ సాఫ్ట్ సంబంధాలు అనే ఖండికలో రచయిత విచారం వ్యక్తం చేస్తుంటే పాఠకుడు కూడా 'జీసస్..ఎంతటి దారుణం!' అనుకోకుండా ఉండలేడు.

భావిభారత పౌరుల్ని ఆణిముత్యాలుగా తీర్చిదిద్దే కార్యక్రమానికి ఏ పేరు పెడ్తే బావుంటుందో ఆలోచించే క్రమంలో దొర్లిన హాస్యానికి దొంతర్లు దొంతర్లుగా నవ్వాలనుకుంటే 'తలచినదే జరిగినదా దైవం ఎందులకు' చదవాల్సిందే. 'తాత ఒడి' ఎలా ఉంది అని ఒకడంటే 'నీ బొంద.. బామ్మ మడి అని కూడా పెట్టు' అంటాడు యింకొకడు. 'ఫలానా పార్టీకి చెందిన రంగనాథయ్య పేరు ప్రతిష్ఠలున్న వ్యాపారి. శివారుల్లో పెద్ద ఖామందు..' అని పత్రికలో వార్త ప్రచురించినందుకు పార్టీ కార్యకర్తలు ఎందుకు పెద్ద గొడవచేసి, కోర్టుకెళ్తామని బెదిరించారో చదివినప్పుడు ఆపుకుందామనుకున్నా నవ్వుని ఆపుకోలేం. నాలుగో తరగతి ఉద్యోగులకు జీతాలు పెంపు అనే వార్త చదివి "ఈ పెద్దోళ్ళున్నారే.. ఎప్పుడూ ఇంతే" అని పిల్లలు ఎందుకనుకున్నారో చదివి, వెన్నెల్లా చల్లగా నవ్వుకోవడమే.

వ్యంగ్యంగా రాసిన కొన్ని ఖండికలు చదివినపుడు ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ఈ రచయితకున్న అవగాహన, ఆందోళన అర్థమౌతాయి. సెల్‌ఫోన్ వల్ల ఏర్పడిన సామాజిక రుగ్మతలు,బంధాల పట్ల నిర్లక్ష్యం, ఎఫ్‌బీలో ఫ్రెండ్ రిక్వెస్టులు పెట్టి చేసే మోసాలు, బ్లాక్ మెయిలింగ్‌లు, ముసలి తల్లిదండ్రుల విషయంలో పిల్లల నిరాదరణ, అనుబంధాలన్నీ ఆర్థిక సంబంధాలతో ముడిపడిన వైనం, భ్రమా స్వామ్యంగా మారిన ప్రజాస్వామ్యం.. ఇలా చాలా విషయాల్ని రచయిత సున్నితంగా విమర్శిస్తూ, సుతిమెత్తటి మొట్టి కాయలు వేశారు.

కొన్ని ఖండికలకు పెట్టిన శీర్షికలు... బ్రోచేవారెవరురా, ఏ తీరుగ నను దయచూచెదవో, అంతర్యామి అలసితి సొలసితి, జగమంతకుటుంబం మాది- ఏకాకి జీవితం మాది, తలచినదే జరిగినదా దైవం ఎందులకు.. ఇలా సినిమా పాటలు, త్యాగరాజ కృతులు, రామదాసు కీర్తనలు, అన్నమయ్య పదాలు గుర్తుకు తెస్తూ మనల్ని అలరిస్తాయి.

వాక్యంలోని పదాల విరుపుల్తో పెదాలమీద నవ్వులు విరబూయించడంలో ఈ రచయిత ఎంత సిద్ధహస్తుడో కొన్ని ఉదాహరణలు గమనించండి.

'ప్లేట్లో మూడో నాలుగో స్వీట్లు తెచ్చిపెట్టింది. అవి ఎప్పుడో ప్లేటో కాలం నాటివి.' 'ఎలాగైతేనేం కారు కొండెక్కింది. మా ఓపికా కొండెక్కింది' కారుని నెట్టీ నెట్టి అలసిపోయిన వారి స్వగతం.

రిటైరై విశ్రాంత జీవితం గడుపుతున్న వృద్ధులు మొదలెట్టబోతున్న కార్యక్రమానికి ఒకతను "వృద్ధే మాతరం" అని పేరు పెడదాం అంటాడు. 'వృద్ధపదం వద్దనుకున్నాం గదా' అంటాడు మరొకడు. 'వృద్ధ కాదు. ఇక్కడ పదం వృద్ధి అంటే డెవలప్‌మెంట్. నాట్ ఓల్డేజ్' అంటూ రీజనింగ్..

'తావులు తావులు రాసి జనాల్ని తావులు తప్పేలా చేయడం ఎందుకనేది నా పశ్న' తన ముందు మాటలో రచయిత..

చక్కని పఠనీయత ఈ రచయిత స్వంతం. ఇందులోని ఖండికలు రెండు మూడు పేజీలకు మించకుండా ఉండటంతో పాఠకుడు సునాయాసంగా చదువుకుంటూ పోతాడు. రచయిత ముందు మాటలో చెప్పినట్టు 'పాఠకుడికి విసుగు పుట్టేలా కాక అప్పుడే అయిపోయిందా అనుకునేలా రచన ఉంటేనే సక్సెస్ అయినట్టు.' ఆ రకంగా ఆలోచిస్తే ఈ పుస్తకం నూటికి నూరు శాతం మార్కులతో విజయం సాధించినట్టే లెక్క

మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తూనే, సమాజంలో వేళ్ళూనుకొంటున్న విష సంస్కృతుల పట్ల ఆలోచనని రేకెత్తించే ఇంత మంచి పుస్తకాన్ని కేవలం వంద కాపీలు మాత్రమే వేయడం కించిత్తు బాధ కలిగించిన విషయం. తెలుగు ప్రజలు పుస్తకాలు కొని, చదివే సంస్కారాన్ని అలవాటు చేసుకోలేదని రచయిత తన వ్యంగ్య ధోరణిలో ఈ రకంగా వ్యాఖ్యానం చేశారేమో?

తెలుగు సాహిత్యానికి ఓ విలువైన పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చిన రచయిత చంద్రప్రతాప్ గారికి అభినందనలు.

- సయ్యద్ సలీం

గ్రంథావిష్కరణ సభకు ఆహ్వానం

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో **డా॥ వి. వెంకటేశ్వర శబ్ద్ కే పరే (హిందీ హైకూ) గ్రంథావిష్కరణ సభ జూలై 10వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు** జూమ్ అంతర్జాల వేదికగా ఐ.డి. 882 881 0417, పాస్‌వర్డ్ 123456 జరుగుతుంది.

సభాధ్యక్షులు : శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య,అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం
పుస్తక ఆవిష్కర్త : డా॥ గుమ్మా సాంబశివరావు, ప్రముఖ సాహితీవేత్త
గ్రంథ సమీక్షకులు : డా॥ పేరిశెట్టి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్‌ప్రొఫెసర్, దక్షిణభారత హిందీప్రచారసభ, మద్రాసు

ఈ సందర్భంగా రచయిత ఉప్పలధడియం వెంకటేశ్వరగారి స్పందన ఉంటుంది.

ఈ పుస్తకావిష్కరణ సభకు ఎస్.ఎమ్.సుభాని (కార్యదర్శి), బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి (కోశాధికారి), చలపాక ప్రకాష్ (ప్రధాన కార్యదర్శి) అందరికి ఆహ్వానం పలుకుతున్నారు.

సమకాలీనతకు పట్టంకట్టిన కవిత

ఏ మనిషీ సమకాలీన సంఘటనలకు స్పందించకుండా, వాటి గురించి ఆలోచించకుండా వుండకపోవడం జీవితంలో ఒక భాగమైపోయినట్టు సమకాలీన స్పృహతో సామాజిక అంశాలను స్పృశించకుండా వుండలేకపోవడం సాహిత్యంలో ఒక భాగమైపోయి దానిని ఒక బాధ్యతగా అది నిర్వర్తిస్తూ వుంది. కవిత్వమూ సమకాలీనతతో అంత అనుబంధాన్ని పెంచుకుంది. అనేకానేక వర్తమాన అంశాలను తనలో ఇముడ్చుకుంటోంది. కళ్ల ముందు అనునిత్యం దోబూచులాడే దృశ్యమాలికల పరిమళాల్ని తనివితీరా ఆస్వాదిస్తూనే వుంది. దుఃఖ రాగాల్నీ రికార్డు చేస్తోంది. అది ఒక ఆమనియై అరుదెంచే ప్రతీసారీ జీవితపు చెట్టుపై కొత్త చిగుళ్లను చిగురింపజేస్తూనే వుంది. అక్షర పూలబాలల మకరంద మాధుర్యాలను పంచుతూనే వుంది. దాని దృష్టి సమ కాలీనతపై సెర్చిలైటులా పడుతూనే వుంది. ఒక పక్క గతాన్ని త్రవ్వకుంటున్నా మరో పక్క వర్తమానపు లోగిళ్ల నిండా తన చూపుల్ని ప్రసరిస్తూనేవుంది. అది ఒకఅద్దంలా సమకాలీనతను ప్రతిబింబిస్తూ తన ప్రయోజనాన్ని నెరవేర్చుకుంటూనే వుంది.

'చెల్లరే విల్లువిరుచునే నల్లవాడు
పదిపదారేండ్ల యెలరాచ పడుచువాడు
సిగ్గుసిగ్గంచు లేచి గర్జించినారు
కనులు గట్టిన తెల్లమొగాలవారు'
(శివధనుర్భంగము ఖండిక నుంచి)

అంటూ రామాయణంలోని ఒక దృశ్యాన్ని సమకాలీన స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో వర్ణిస్తాడు కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి. శివధనుర్భంగం ఘట్టంలో స్వాతంత్ర్యోద్యమ తుది విజయాన్ని వీక్షించాడు కవి. దానిని ధ్వన్యాత్మకం చేసింది కవిత్వం. సీతాదేవిని వరించే సందర్భంలో రాముడి పరాక్రమాన్ని వర్ణిస్తూనే సమకాలీనతను మరచిపోలేదు కవి. అంతఃపురంలో అంతమంది రాజకుమారులున్నా ఎవ్వరూ విరచలేని శివధనస్సును రాముడు ఫెటిల్లుమని విరిచేస్తే అక్కడి వాళ్లంతా అవమానభారంతో కృంగిపోయారట. అహింసామార్గంలో ఒక వ్యక్తి చైతన్యశక్తియై, గాంధీ మహాత్ముడై స్వాతంత్ర్య పోరాటంలో విజయాన్ని సాధిస్తే తెల్లవాళ్లు తెల్లమొగాలు వేశారట. తెల్లశబ్దంతో పద్యంలోని అసలు రహస్యాన్ని బట్టబయలు చేసి సమకాలీనతకు అద్దం పట్టిందీ కవిత్వం.

'ఏడీ ఎక్కడ ధర్మజుడేడీ హరిశ్చంద్రుడేడీ
దేవతావస్త్రాల కథల్లో పసిపిల్లడేడీ
త్రిశూలాలతో కూల్చేశారా రబ్బరు గుండెలకు
కొక్కేలను తగిలించి శుద్ధి చేశారా
చరిత్రకు చేతబడి చేశారా రాలిన శిథిలాల్లోంచి
ఉరాంగ్ ఉటాన్ లేచి రాలేదా
మనిషి సిగ్గుపడుతున్నాడా
దేశాన్ని నగ్నంగా చేసిచూద్దాం మనుషులను
ఒకటొకటిగా వలిచేద్దామా లోపల చెదలు పుట్టలు తప్ప
విగ్రహాలుండవు' (క్రీ.పూ. 1992 డిసెంబర్6 ఖండికనుంచి)

అంటాడు వర్తమాన కవి ప్రసేన్ కళ్లముందు జరిగిన హృదయవిదారక సంఘటనకు అక్షరరూపమిస్తూ. ఒక ప్రశాంతత వున్నట్టుండి అల్లకల్లోలంగా మారినప్పుడు, ఒక దృశ్యం ఒక్కసారిగా విధ్వంసక దృశ్యమైపోయినప్పుడు పెల్లుబికిన అలజడి కవిత్వమైంది. కన్నీటిధారల్ని వర్షించింది. జడలు విచ్చుకున్న మతమౌఢ్యపు వికారాన్ని అది బట్టబయలు చేసింది. మతకలహాల మారణహోమ పరిణామాల్ని వ్యంగ్యంగా ఎత్తిచూపింది. ఈ మారణహోమాన్ని వివరిస్తూనే ధర్మరాజు, హరిశ్చంద్రుడు వంటి మహామహుల్ని గుర్తు చేసింది. చరిత్రకే చేతబడి జరిగిపోయిందని వాపోయింది. వేలయేళ్ల నాటి అనాగరిక ఆటవిక సమాజపు దుస్థితిని సమకాలీన సమాజంలో దర్శించలేకపోయింది. మనిషి నిండా చెదల్లా, పుట్టల్లా అల్లుకుపోతున్న మతమౌఢ్యాన్ని చూడలేక సతమతమైపోతూ వుంది కవిత్వం. అందుకే అది సమకాలీనతను సంస్కరించాలని తపించిపోతూ వుంది.

డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, సెల్: 9177732414

'మహా' స్పీకర్‌గా నర్వేకర్

- అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల తొలి రోజు ఎన్నిక
- బీజేపీ కొలాబా ఎమ్మెల్యేకి దక్కిన పదవి
- ఓటింగ్‌కి ఇద్దరు ఎస్పీ, ఒక ఏఐఎంఐఎం సభ్యులు దూరం
- మొత్తంగా హాజరుకాని సభ్యులు12 మంది
- సేన సభ్యులు కొంతమంది విప్ ధిక్కరించారు : ఎన్‌సీపీ

ముంబై : మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీకి చెందిన రాహుల్ నర్వేకర్ ఎన్నికయ్యారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల తొలి రోజు నిర్వహించిన ఎన్నికలో 164 ఓట్లు సాధించిన నర్వేకర్, 107 ఓట్లు సాధించిన ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన అభ్యర్థి రాజన్ సాల్వీని ఓడించారు. కాంగ్రెస్‌కి చెందిన నానా పటోల్ రాజీనామా చేయడంతో గత ఏడాది ఫిబ్రవరి నుంచి స్పీకర్ పదవి ఖాళీగా ఉంది. దేశంలోనే పిన్న వయస్కుడైన అసెంబ్లీ స్పీకర్ నర్వేకర్ (45) అని ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తెలిపారు. ఆయన మామ, ఎన్‌సీపీకి చెందిన రాంరాజె నాయక్ మహారాష్ట్ర శాసన మండలి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆదివారం 11 గంటలకు దక్షిణ ముంబైలోని విధాన్ భవన్‌లో 288 మంది సభ్యుల రెండు రోజుల ప్రత్యేక సమావేశం ప్రారంభమయింది. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో బల పరీక్షను ఎదుర్కోనున్నది. కాగా సేన్‌కి చెందిన రమేశ్ లాట్కే మరణించిన కారణంగా అసెంబ్లీలో ఒక స్థానం ఖాళీగా ఉంది. ఎన్‌సీపీ శాసనసభ్యుడు నరహరి జిర్వాల్ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్నందున ఓటు వేయలేకపోయారు. ఓట్ల లెక్కింపు తర్వాత జిర్వాల్ మాట్లాడుతూ 'శివసేన ఎమ్మెల్యేలు కొంత మంది పార్టీ విప్‌ని ధిక్కరించి ఓటు వేశారు. దానిని ధ్రువీకరించాలి. వారిపై చర్యలు తీసుకోవాలి' అని అన్నారు. 287 మంది ఎమ్మెల్యేలకుగాను 271 మంది ఓటు వేశారు. అయితే ముగ్గురు ఎమ్మెల్యేలు... రైస్ షేక్, అబూ అజ్మీ (ఇద్దరూ సమాజ్‌వాది పార్టీకి చెందిన వారు), షా ఫరూక్ (ఏఐఎంఐఎం) ఓటింగ్‌కి దూరంగా ఉన్నారు. సభలో స్పీకర్ ఎన్నికకు 12 మంది ఎమ్మెల్యేలు హాజరుకాలేదు. వారిలో ఇద్దరు లక్ష్మణ్ జగ్తాప్, ముక్తా తిలక్ (బీజేపీ) ఇద్దరూ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇక ఎన్‌సీపీ ఎమ్మెల్యేలు అనిల్ దేశ్‌ముఖ్, నవాబ్ మాలిక్ వేర్వేరు మనీలాండరింగ్ కేసుల్లో జైలులో ఉన్నారు. ఎన్‌సీపీకి చెందిన మరో నలుగురు ఎమ్మెల్యేలు దత్తాత్రే భరణే, అన్నా బన్సోడే, నీలేశ్ లంకే, బాబందదా షిండే హాజరుకాలేదు. 'భరణే తన తల్లి కొద్ది రోజుల క్రితం మరణించిన కారణంగా స్పీకర్ ఎన్నికకు హాజరుకాలేదు' అని ఎన్‌సీపీ నాయకుడు ఒకరు తెలిపారు. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రణితి షిండే, జితేశ్ అంతపుర్కర్ సమావేశానికి హాజరుకాలేదు. అంతపుర్కర్ ఆదివారం పెళ్లి చేసుకుంటున్నారు. ప్రణితి షిండే విదేశాల్లో ఉన్నారని కాంగ్రెస్ నాయకుడు ఒకరు తెలిపారు. ఏఐఎంఐఎం ఎమ్మెల్యే ముఫ్తీ మహమ్మద్ ఇస్మాయిల్ కూడా సమావేశానికి హాజరుకాలేదు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి బాలాసాహెబ్ థోరట్ సభలో నర్వేకర్‌ని అభినందిస్తూ, స్పీకర్ ఎన్నిక పారదర్శకంగా జరిగింది. కొంతకాలంగా గవర్నర్‌ని కలిసి ఇదే డిమాండ్ చేస్తున్నాం. సంవత్సరన్నర కాలానికి పైగా గవర్నర్ నిద్రపోతున్నట్లు కనిపిస్తోంది' అని అన్నారు. అంతకుముందు, ఈ సంవత్సరం ప్రారంభంలో మహా వికాస్ అగాడి (శివసేన, ఎన్‌సీపీ, కాంగ్రెస్‌లతో కూడి ఎంవీఏ) మార్చి నెలలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ స్పీకర్ ఎన్నికల షెడ్యూల్‌ని ఆమోదించాలని గవర్నర్ కోశ్యారిని కోరాయి. దీనికి ముందు, మునుపటి శాసనసభ సమావేశంలో, అప్పటి ఎంవీఏ ప్రభుత్వం వాయిస్ ఓటు ద్వారా స్పీకర్ ఎన్నికను సులభతరం చేయడానికి ప్రస్తుత నిబంధనలను సవరించింది. గవర్నర్ నిర్ణయాన్ని రాజ్యాంగ విరుద్ధమని అభివర్ణించారు. న్యాయ అభిప్రాయాన్ని కోరారు. ఇదిలా ఉండగా, శివసేన తిరుగుబాటు ఎమ్మెల్యేలు సమీపంలోని విలాసవంతమైన హోటల్ నుంచి విధాన్ భవన్ ప్రాంగణంలోకి ప్రవేశించినప్పుడు వారికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని ప్రభుత్వాన్ని శివసేన నాయకుడు ఆదిత్య ఠాక్రే లక్ష్యంగా చేసుకున్నారు. షిండేకు మద్దతిచ్చే రెబల్ శివసేన ఎమ్మెల్యేలు శనివారం సాయంత్రం గోవా నుంచి ముంబైకి తిరిగి వచ్చి దక్షిణ ముంబైలోని ఓ విలాసవంతమైన హోటల్‌లో బస చేశారు. సభ ప్రారంభం కాకముందే ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గం విధాన్ భవన్‌లోని శాసనసభా పక్ష కార్యాలయానికి సీల్ వేసింది. విధాన్ భవన్‌లోని సేన శాసనసభా పక్ష కార్యాలయం మూసి ఉన్న తలుపులపై ప్లాస్టిక్ టేపుతో ఒక కాగితం అంటించబడింది, దానిపై మరాఠీలో 'శివసేన శాసనసభా పక్షం సూచనల మేరకు కార్యాలయం మూసివేయబడింది' అని రాసి ఉంది. గత నెలలో ఏక్‌నాథ్ షిండే పార్టీపై తిరుగుబాటుకు దిగారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఆయన పక్షాన నిలిచారు. ఇది ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని ఎంవీఏ ప్రభుత్వం పతనానికి దారితీసింది. మహారాష్ట్ర 20వ ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండే గురువారం ప్రమాణ స్వీకారం చేయగా, డిప్యూటీ సీఎంగా బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవిస్ ప్రమాణ స్వీకారం చేశారు.

ఎవరీ రాహుల్ నర్వేకర్...?

ముంబై : మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండే బాధ్యతలు స్వీకరించి, రాష్ట్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల తర్వాత, మొదటిసారి బీజేపీ శాసనసభ్యుడు రాహుల్ నర్వేకర్ ఆదివారం మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. రాహుల్ గెలుపునకు 145 ఓట్లు అవసరం కాగా మద్దతుగా 164 ఓట్లు వచ్చాయి. నర్వేకర్ రాజకీయ కుటుంబానికి చెందినవాడు. ఆయన మహారాష్ట్రలోని కొలాబా అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. కొత్తగా ఎన్నికయిన స్పీకర్ మహా వికాస్ అఘాడి అభ్యర్థి రాజన్ సాల్వితో పోటీ పడ్డారు. మహారాష్ట్ర రాజకీయాల్లో రాహుల్ నర్వేకర్ సుపరిచితుడు. ఆయన వృత్తిరీత్యా న్యాయవాది. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నర్వేకర్ తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. నర్వేకర్ గతంలో శివసేన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) తో సంబంధం కలిగి ఉన్నారు. ఆయన శివసేన యువజన విభాగం అధికార ప్రతినిధిగా కూడా పని చేశారు.

కుటుంబ నేపథ్యమేమిటంటే...

రాహుల్ నర్వేకర్ రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి. అతని తండ్రి సురేష్ నర్వేకర్ కౌన్సిలర్. 2014లో రాహుల్ నర్వేకర్ శివసేనలో ఉన్నారు. ఆ సమయంలో ఆయన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తానని వాదించినా టికెట్ దక్కలేదు. ఈయన ఎన్‌సీపీ నుంచి శాసనసభ్యుడిగా, మహారాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్‌పర్సన్, స్పీకర్, రాంరాజే నాయక్ నింబాల్కర్‌కి అల్లుడు. శివసేన తనకు టికెట్ నిరాకరించడంతో రాహుల్ నర్వేకర్ ఎన్‌సీపీలో చేరారు. ఎన్‌సీపీ రాహుల్ నర్వేకర్‌ని మావల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీకి దింపింది. అయితే ఆయన ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఆ తర్వాత బీజేపీలో చేరారు. రాహుల్ సోదరుడు కొలాబా కార్పొరేటర్‌గా ఉన్నారు.

ఉమేశ్ హత్య నిందితుడు మిత్రుడే

సోదరుడు మహేశ్ కోలే

అమరావతి: రసాయన శాస్త్రవేత్త ఉమేశ్ కోలే హత్య కేసు నిందితుల్లోని యూసుఫ్ ఖాన్ తమకు బాగా తెలిసిన వ్యక్తి అని మృతుడి సోదరుడు మహేశ్ కోలే తెలిపారు. మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ నేత నూపుర్ శర్మ చేసిన అనుచిత వ్యాఖ్యలకు మద్దతు పలికిన మహారాష్ట్రలోని అమరావతికి చెందిన ఉమేశ్ జూన్ 21న హత్యకు గురయ్యారనే ప్రచారం జరుగుతోంది. ఈ హత్యోదంతంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించడం, కేసును ఎన్ఐఏకి బదిలీ చేయడంతో ఉమేశ్ సోదరుడు తన అభిప్రాయాలను ఒక టీవీ ఛానల్‌తో పంచుకున్నారు. తన సోదరుడి హత్య కేసులో అరెస్టయిన యూసుఫ్ ఖాన్ పశు వైద్యుడని, తన సోదరుడికి- అతనికి మధ్య మంచి స్నేహం ఉందని తెలిపారు. 2006 నుంచి యూసుఫ్‌ఖాన్ తమకు తెలుసునని చెప్పారు. హత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్న ఆరుగురు నిందితుల్లో యూసుఫ్‌ఖాన్ ఉన్నట్టు తెలిపారు. ఈ కేసు విషయంలో పోలీసుల వైఖరి సరిగా లేదని పేర్కొన్నారు. కేసు విషయంలో ఏకంగా కేంద్ర హోంమంత్రి జోక్యం చేసుకోవడం ఏమిటో తనకు అర్థం కావడం లేదన్నట్టు వ్యాఖ్యానించారు. అమిత్ షా జోక్యం చేసుకోకుండా కేసు పూర్వాపరాలను పరిశీలించి ఉండవచ్చునని చెప్పారు. హోంమంత్రి జోక్యం దురదృష్టకరమన్నారు. తన సోదరుడికి ఎవరితో వైరం లేదని తెలిపారు. ఎవరితోనూ ఎటువంటి తగాదాలు లేని వ్యక్తిని ఎందుకు హత్య చేశారనే విషయం వెలుగులోకి రావలసి ఉందన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరపాలని, నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు. ఇదిలా ఉండగా వ్యక్తిగత గొడవలు, దొంగతనం వంటి కారణాలతో హత్య జరిగి ఉంటుందని ఒకవైపు, ఉదయ్‌పూర్‌లో జరిగిన కన్నయ్యలాల్ హత్య తరహాలోనే ఉమేశ్ హత్య జరిగిందని మరోవైపు బీజేపీ నేతలు వాదిస్తున్నారు.

తృణమూల్, బీజేపీ నాటకాలు

సీపీఎం విమర్శ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ, టీఎంసీకి మధ్య అవగాహన ఉందని, వామపక్ష సంఘటనతో పాటు ఇతర పార్టీలను తొక్కేసేందుకు ఈ రెండు పార్టీలు రాజకీయ క్రీడ కొనసాగిస్తున్నాయని సీపీఎం విమర్శించింది. బెంగాల్‌లో టీఎంసీపై పోరాడే ఉద్దేశం బీజేపీ నాయకత్వానికి ఉందా అని ప్రశ్నించింది. ఈ రెండు పార్టీలు తెరపై కొట్టుకుంటూ తెరవెనుక కలిసి పనిచేస్తాయని వ్యాఖ్యానించింది. టీఎంసీని బీజేపీ వ్యతిరేకించడం కేవలం కంటి తుడుపే అని సీపీఎం సీనియర్ నేత సుజన్ చక్రవర్తి ఆదివారం విలేకరుల సమావేశంలో అన్నారు. ఇప్పటివరకు బెంగాల్‌లోని అధికారపక్షంపై ఏ కేసులూ ముగింపు దశకు చేరుకోకపోవడమే ఇందుకు నిదర్శనమని శారదా కుంభకోణం, నారద టేపుల వ్యవహారాలను ఉద్దేశించి అన్నారు. ఈ పార్టీల రాజకీయ ఎత్తుగడులపై తమ పార్టీ అనేకమార్లు హెచ్చరించడాన్ని గుర్తుచేశారు. తెలంగాణ, హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశం అనంతరం అసోం ముఖ్యమంత్రి హిమంతా బిశ్వశర్మ విలేకరులతో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్, తెలంగాణలో కుటుంబ పాలన అంతానికి అమిత్‌షా పిలుపునిచ్చినట్లు తెలిపారు. దీనిపై చక్రవర్తి స్పందిస్తూ బీజేపీ స్వలాభం కోసం మిగతా విపక్షాలన్నింటిని పక్కకుపెట్టి టీఎంసీని పైకి తెస్తోందని విమర్శించారు. సీబీఐకి అప్పగించినాగానీ నారద, శారదా కేసులు ఇప్పటివరకు ఎందుకని పురోగతి సాధించలేదని ఆయన ప్రశ్నించారు. బీజేపీ, టీఎంసీ ప్రదర్శించే శత్రుత్వం కంటితుడుపు తప్ప మరేమీ కాదని వ్యాఖ్యానించారు.

'గోద్రా' కేసు నిందితుడికి జీవిత ఖైదు

అహ్మదాబాద్: గోద్రాలో రైలు బోగీలకు నిప్పు పెట్టి 59 మంది కరసేవకుల మరణానికి కారణమైన కేసులో నిందితుడు రఫీక్ భతూక్‌కు జీవిత ఖైదు విధించారు. ఈ మేరకు పంచమహల్ జిల్లాలోని గోద్రా అదనపు సెషన్స్ న్యాయమూర్తి తీర్పును వెలువరించారు. రఫీక్‌ను 2021లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం అతడిపై విచారణను వేగవంతం చేశారు. 2002 ఫిబ్రవరి 27న అయోధ్య నుంచి కరసేవకులతో తిరిగి వస్తున్న రైలుకు గోద్రా స్టేషన్‌లో దుండగులు నిప్పుపెట్టారు. ఈ కేసులో రఫీక్ నిందితుడు. ఈ ఘటన అనంతరం గుజరాత్ చరిత్రలోనే దారుణమైన మతఘర్షణలు చోటు చేసుకొన్నాయి. వీటిల్లో దాదాపు 1200 మంది ప్రాణాలు కోల్పోయారు. రైలు దహనం కేసులో ఇప్పటి వరకు న్యాయస్థానం 35 మంది నిందితులకు శిక్ష విధించింది. 2011లో స్పెషల్ సిట్ కోర్టు 31 మంది నిందితులను దోషులుగా తేల్చింది. వారిలో 11 మందికి మరణ శిక్ష విధించగా.. 20 మందికి జీవిత ఖైదు విధించారు. 2016లో 11 మరణశిక్షలను గుజరాత్ హైకోర్టు జీవిత ఖైదుగా మార్చింది. ఆ తర్వాత ఈ కేసులో మరో ముగ్గురికి జీవిత ఖైదు విధించారు. పంచమహల్‌కు చెందిన ప్రత్యేక ఆపరేషన్ల గ్రూప్ పోలీసులు గతేడాది ఫిబ్రవరిలో రఫీక్‌ను గోద్రాలో అరెస్టు చేశారు. 2002లో రైలు దహనం తర్వాత రఫీక్ పేరు బయటకు రావడంతో అతడు గోద్రాను వదిలి పారిపోయాడు. దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో దాక్కొని గతేడాది తిరిగి గోద్రాకు వచ్చాడు.

మామ 'మండలి'...అల్లుడు 'అసెంబ్లీ'

ముంబై: మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. శాసనమండలి, అసెంబ్లీ స్పీకర్‌గా మామ, అల్లుడు ఎన్నికై రికార్డు సృష్టించారు. షిండే వర్గం మద్దతుతో స్పీకర్‌గా ఎన్నికైన బీజేపీ నేత రాహుల్ నర్వేకర్. మండలి చైర్మన్‌గా రామ్‌రాజే నాయక్‌కు స్వయానా అల్లుడు. అయితే, మామ మాత్రం ఎన్‌సీపీ (నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ)కి చెందిన వ్యక్తి కాగా.. అల్లుడు మాత్రం బీజేపీ నేత కావడం విశేషం. మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన రాహుల్ నర్వేకర్ (45) ఈ పదవిని చేపట్టిన పిన్న వయస్కుడని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పేర్కొన్నారు. ముంబైలోని కొలాబా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రాహుల్ నర్వేకర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే, శివసేన యూత్ విభాగం అధికార ప్రతినిధిగా ఉన్న ఆయన..2014లో పార్టీని వీడి ఎన్‌సీపీలో చేరారు. శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే దూరం పెట్టడం వల్లే పార్టీని వీడిపోతున్నట్లు అప్పట్లో పేర్కొన్నారు. 2014లో మవాలా అసెంబ్లీ నుంచి పోటీ చేసిన నర్వేకర్.. శివసేన అభ్యర్థి చేతిలో ఓటమిపాలయ్యారు. అనంతరం 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీలో చేరి.. కొలాబా స్థానం నుంచి గెలుపొందారు. తాజాగా ఏక్‌నాథ్ షిండే, బీజేపీ మద్దతుతో అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. నర్వేకర్ సోదరుడు మాత్రం ప్రస్తుతం కొలాబా కార్పొరేటర్‌గా కొనసాగుతున్నారు. ఇదిలాఉంటే, మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏక్‌నాథ్ షిండే.. అసెంబ్లీలో బలనిరూపణకు సిద్ధమయ్యారు. ఇందుకు సోమవారం ముహూర్తం ఖరారైంది.

స్వల్ప ఊరట... తగ్గిన కరోనా కేసులు

న్యూఢిల్లీ : దేశంలో కరోనా కేసులు హెచ్చు తగ్గులుగా నమోదు అవుతున్నాయి. శనివారం 17 వేలకు పైగా కేసులు నమోదు కాగా, ఆదివారం స్వల్పంగా తగ్గాయి. శనివారం 3,76,720 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా..16,103 కరోనా కేసులు వెలుగు చూశాయి. మరో 31 మందిని మహమ్మారి బలితీసుకుంది. దీంతో దేశంలో ఇప్పటి వరకు మొత్తం నమోదైన కేసుల సంఖ్య 4,35,02,429. కాగా, 5.25 లక్షల మందికి పైగా మరణించినట్లు ఆదివారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుతం దేశంలో క్రియాశీలక కేసుల సంఖ్య 1,11,711గా ఉంది. శనివారంతో పోల్చుకుంటే 2,143 క్రియాశీలక కేసులు పెరిగాయి. యాక్టివ్ కేసుల శాతం 0.26 శాతంగా ఉంది. గడిచిన 24 గంటల్లో 13,929 మంది కోలుకున్నారు. మొత్తంగా ఇప్పటి వరకు 4.28 కోట్ల మంది కరోనాను జయించారు. అదే సమయంలో రికవరీ రేటు 98.54 శాతంగా నమోదైంది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 197.95 కోట్ల వాక్సిన్ డోసుల్ని పంపిణీ చేశారు.

ఎస్‌పీలో అన్ని విభాగాలు రద్దు: అఖిలేశ్

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ)లోని అన్ని అనుబంధ విభాగాలను రద్దు చేస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ ట్విట్టర్ వేదికగా పంచుకుంది. పార్టీలోని జాతీయ. రాష్ట్ర, జిల్లాలకు సంబంధించిన కార్యవర్గాలు సహా యువజన, మహిళా విభాగాలన్నింటినీ రద్దు చేసినట్టు తీసుకున్న నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపింది. అయితే ఒక్క యూపీ రాష్ట్రశాఖ అధ్యక్ష పదవిని మాత్రమే కొనసాగించేలా అఖిలేశ్ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. దీంతో యూపీ అధ్యక్షుడు నరేశ్ ఉత్తమ్ ఆ స్థానంలో కొనసాగుతారని పార్టీ తెలిపింది. ఈ భారీ ప్రక్షాళనకు కారణాలేమిటో పార్టీ వెల్లడించలేదు. 2024 లోక్‌సభ ఎన్నికల కోసం సమాయత్తమయ్యేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన రెండు సిట్టింగు లోక్‌సభ స్థానాలైన ఆజంఘడ్, రామ్‌పూర్ ఉపఎన్నికల్లో పార్టీ ఓటమి పాలు కావడంతో సంస్థాగతంగా మార్పులు అవసరమని అఖిలేశ్ భావిస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

రేపు ఆహార మంత్రుల సదస్సు

పీడీఎస్, పౌష్టికాహార భద్రతపై చర్చ

న్యూఢిల్లీ: ఆహార భద్రత, ప్రజా పంపిణీ వ్యవస్థల మెరుగుదలే లక్ష్యంగా రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రుల సదస్సు మంగళవారం న్యూఢిల్లీలో జరగనున్నది. కేంద్ర ఆహార, వినియోగ వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రసంగిస్తారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో సంస్కరణలతో పాటు పౌష్టికాహార భద్రతపై సదస్సు చర్చించనుంది. కేంద్రమంత్రులు సాధ్వీ నిరంజన్ జ్యోతి, అశ్వినీ కుమార్ చౌబే హాజరుకానున్నారు. ఆహార పటిష్టత (ఫోర్టిఫికేషన్), ఫుడ్ బాస్కెట్ - పంట వైవిధ్యత, సమగ్ర అన్నవితరణ్ పోర్టల్ 2.0, పీడీఎస్‌లో సంస్కరణలు'పై సదస్సు ప్రధానంగా చర్చిస్తుందని కేంద్ర ఆహార, వినియోగ వ్యవహారాల శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని రాష్ట్రాలు అనుసరించే ఉత్తమ పద్ధతులను విస్తృతం చేయడంపైనా సమాలోచనలు జరుగుతాయని పేర్కొంది. సహకార సమాఖ్యవాదం స్ఫూర్తితో సవాళ్లు, అవకాశాలపై చర్చకు ఈ సదస్సు వేదిక అవుతుందని తెలిపింది. జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద చేపట్టే భారత లక్షిత ప్రజాపంపిణీ వ్యవస్థ (టీపీడీఎస్) ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాహార-భద్రత కార్యక్రమం. దేశం లోని 80కోట్ల మంది లబ్ధిదారుల ఆహార భద్రతా వసరాలను 5.33 లక్షల రేషన్ దుకాణాల నెట్వర్క్ ద్వారా తీర్చుతోంది. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై)తో పాటు ఒక దేశం ఒకటే రేషన్ కార్డు (ఓఎన్ఓఆర్‌సీ) ద్వారా కోవిడ్ కాలంలో పేదలకు జీవాధారాన్ని ప్రభుత్వం కల్పించింది అని అధికారిక ప్రకటన పేర్కొంది.

ఒడిశాలో ర్యాగింగ్... విద్యార్థిని ఆత్మహత్య

భువనేశ్వర్: ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఓ డిగ్రీ విద్యార్థిని (18) తన హాస్టల్ గదిలో శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. తన సీనియర్లు తనను ర్యాగింగ్, వేధింపులకు గురి చేస్తున్నారని సూసైడ్ నోట్‌లో ఆమె ఆరోపించినట్లు తెలుస్తోంది. ఆమె భువనేశ్వర్‌లోని ఓ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్నారు. హాస్టల్ సూపరింటెండెంట్ జ్యోతిరథ్ మాట్లాడుతూ, ఈ విద్యార్థిని బీఏ ఆనర్స్ చరిత్ర కోర్సు చదువుతున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఆమె రూమ్‌మేట్లు తరగతులకు హాజరయ్యేందుకు వెళ్లారని, ఆమె తన గదిలో లోపలి నుంచి గడియ వేసుకున్నారని చెప్పారు. క్లాసుల నుంచి తిరిగి వచ్చిన విద్యార్థినులు గది తలుపులు తెరవకపోవడంతో వారు తమకు సమాచారం ఇచ్చారన్నారు. అనంతరం తాము ఆ గది తలుపులను తెరిచి చూశామని, ఆ విద్యార్థిని మరణించి కనిపించారని తెలిపారు. ఆత్మహత్యకు ముందు ఆ విద్యార్థిని రాసిన లేఖలో తాను తీవ్ర మనోవేదనతో బాధపడుతున్నట్లు తెలిపారు. ముగ్గురు సీనియర్ స్టూడెంట్స్ తనను తీవ్రంగా ర్యాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. తన బాధలను తన తల్లిదండ్రులకు, రూమ్‌మేట్స్‌కు చెప్పలేకపోతున్నానని పేర్కొన్నారు. అయితే ఆమె ఈ లేఖలో తనను వేధిస్తున్న సీనియర్ల పేర్లను రాయలేదు. బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భారత్‌లో మత స్వేచ్ఛ...

అమెరికా ప్యానెల్ వ్యాఖ్యలు ఏకపక్షం

న్యూఢిల్లీ: దేశంలో మత స్వేచ్ఛపై అమెరికాకు చెందిన అంతర్జాతీయ మత స్వేచ్ఛ కమిషన్ ఏకపక్షంగా, తప్పుడు వ్యాఖ్యలు చేసిందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దుయ్యబట్టింది. భారత దేశం గురించి, దాని రాజ్యాంగ నిర్మాణం గురించి, దాని బహుతావాదం, ప్రజాస్వామిక విలువలు, స్వభావం గురించి ఏమాత్రం అవగాహన లేదనే విషయం ఈ వ్యాఖ్యల్లో ప్రతిబింబిస్తోందని పేర్కొంది. భారతదేశంలో విమర్శించే గళాలను అణగదొక్కుతున్నారని, ముఖ్యంగా మతపరమైన అల్ప సంఖ్యాకులను, వారి కోసం పని చేస్తున్నవారిని అణచివేస్తున్నారని శుక్రవారం వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి స్పందిస్తూ, భారతదేశంపై చేసిన ఏకపక్ష, తప్పుడు వ్యాఖ్యలను గమనించినట్లు తెలిపారు. దేశం గురించి, దాని రాజ్యాంగ నిర్మాణం గురించి, దాని బహుతావాదం, ప్రజాస్వామిక విలువలు, స్వభావం గురించి ఈ ప్యానెల్‌కు ఏమాత్రం అవగాహన లేదనే విషయం ఈ వ్యాఖ్యల్లో ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ ప్యానెల్ తన ప్రేరేపిత ఎజెండాకు అనుగుణంగా పదే పదే తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తోందన్నారు. ఇటువంటి చర్యలు కేవలం ఈ సంస్థ విశ్వసనీయత, నిష్పాక్షికతలపై ఆందోళన బలపడటానికి మాత్రమే ఉపయోగపడతాయన్నారు.

24వ అంతస్తు నుంచి దూకి యువతి ఆత్మహత్య

చెన్నై: ఉద్యోగం లేదు..పెళ్లి కాలేదు.. అనే తీవ్ర మనో వేదనలో ఉన్న ఓ యువతి శనివారం వేకువజామున 24వ అంతస్తు నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. చెన్నై ఓఎంఆర్ రోడ్డులోని కేలంబాక్కంలో 30 అంతస్తుల భవనం ఉంది. ఇందులో 24వ అంతస్తులో విలియం జేమ్స్, ఆయన కుమార్తె జెనీఫర్(35) నివాసం ఉంటున్నారు. ఇది వరకు జెనీఫర్ ఓ ఐటీ సంస్థలో పనిచేసేవారు. కరోనా పరిస్థితుల తర్వాత ఉద్యోగం కోల్పోయింది. దీంతో మరో ఉద్యోగం కోసం ఏడాది కాలంగా ఆమె తీవ్ర ప్రయత్నంలో ఉన్నారు.

అయితే ఉద్యోగం దొరక్క పోవడం, వయసు మీద పడ్డా పెళ్లి కాక పోవడం వంటి పరిస్థితులు ఆమెను తీవ్ర మనో వేదనకు గురి చేశాయి. రెండు రోజుల క్రితం ఓ ఇంటర్వ్యూకు వెళ్లినా, అవకాశం దక్కక పోవడంతో ఆమె మరింత కుంగిపోయింది. శుక్రవారమంతా గదికే పరిమితమయ్యారు. ఈ పరిస్థితుల్లో శనివారం వేకువ జామున 3గంటల సమయంలో గది కిటికీ గుండా ఆమె కిందకి దూకేసింది. శబ్దం విన్న సెక్యూరిటీ సిబ్బంది పరుగులు తీయగా.. అప్పటికే ఆమె శరీరం ఛిద్రమైంది. ఘటనా స్థలంలోనే ఆమె మరణించింది. కేలంబాక్కం పోలీసులు కేసు నమోదు చేసిన మృత దేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

ఉగ్రవాదులను బంధించి పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

శ్రీనగర్: ఇద్దరు ఉగ్రవాదులను గ్రామస్తులు బంధించి పోలీసులకు అప్పగించిన ఘటన జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకుంది. రెయిసీ జిల్లాలోని టక్సన్ గ్రామంలో ఆదివారం ఇద్దరు లష్కరే తొయిబా ఉగ్రవాదులను గ్రామస్తులు బంధించారు. రాజౌరీ జిల్లాకు చెందిన లష్కరే కమాండర్ తాలిబ్ హుస్సేన్ వీరిలో ఉన్నాడు. ఇటీవల రాజౌరీ జిల్లాలో జరిగిన ఐఈడీ పేలుళ్లలో ఇతడి పాత్ర ఉంది. మరో ఉగ్రవాది ఫైజల్ అహ్మద్ దార్ దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాకు చెందినవాడు. మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఇతని పేరు ఉన్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు. వీరితో పాటు రెండు ఏకే రైఫిల్స్, ఏడు గ్రనేడ్‌లు, పిస్తోల్‌ను స్వాధీనం చేసుకొన్నారు. అనంతరం పోలీసుకు అప్పగించారు. టక్సన్ గ్రామస్తులకు పోలీసులు ధన్యవాదాలు తెలిపారు. గ్రామస్తుల ధైర్య సాహసాలను ప్రశంసిస్తూ అదపు డీజీపీ రూ.2 లక్షల బహుమానాన్ని ప్రకటించారు. అలాగే రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా మరో రూ.5 లక్షలను బహుమతిగా ప్రకటించినట్లు మీడియా పేర్కొంది. ఈ విషయాన్ని ఏడీజీపీ జమ్ము ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

కసబ్‌కు కూడా ఇంత భద్రత ఇవ్వలేదు: ఆదిత్య ఠాక్రే

ముంబై: రెబల్ శివసేన ఎమ్మెల్యేలకు ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం కల్పించిన కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లపై శివసేన నేత ఆదిత్య ఠాక్రే ఛలోక్తులు విసిరారు. కసబ్‌కు కూడా ఇంత భద్రత కల్పించలేదన్నారు. ఒక లగ్జరీ హోటల్ నుంచి భారీ బందోబస్తు మధ్య రెబల్ ఎమ్మెల్యేలను ఆదివారం విధాన్ భవన్‌కు తీసుకువచ్చారు. దీనిపై ఆదిత్య ఠాక్రే స్పందిస్తూ, ముంబైలో ఇంతకుముందెన్నడూ ఇలాంటి భద్రతను తాము చూడలేదని, ఎందుకు అంత భయమని ఆయన ప్రశ్నించారు.

షిండే సారథ్యంలోని సేన-బీజేపీ ప్రభుత్వం ఈనెల 4న అసెంబ్లీలో బలం నిరూపించుకోవాల్సి ఉంది. రెండు రోజల ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఉండటంతో షిండేకు మద్దతుగా నిలిచిన రెబల్ శివసేన ఎమ్మెల్యేలు శనివారం సాయంత్రం గోవా నుంచి ముంబైకి ఒక చార్టెట్ విమానంలో తిరిగివచ్చారు. గోవాకు ఉదయమే వెళ్లిన షిండే వారిని తనవెంట తీసుకొచ్చారు. చిన్నపార్టీలు, ఇండిపెండెంట్లు కలిపి 10 మంది ఎమ్మెల్యేలు, బీజేపీకి చెందిన 106 మంది ఎమ్మెల్యేలు షిండేకు మద్దతిస్తున్నారు.

ఆ ద్వేషాన్ని ముంబైపై చూపకండి

శివసేన బీజేపీతో ఆది నుంచి వ్యతిరేకిస్తున్న ముంబైలోని వివాదాస్పదమైన మెట్రో కార్ షెడ్ ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తోంది ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం. దీంతో మాజీ మంత్రి ఆదిత్య థాక్రే తమపై ఉన్న ద్వేషాన్ని ముంబైపై చూపించొద్దు అంటూ అభ్యర్థించారు. మెట్రో కార్‌షెడ్ ప్రాజెక్టు కోసం పచ్చని అటవీ ప్రాంతన్ని నాశనం చేయవద్దని కోరారు. ఆరే అనే అటవీ ప్రాంతంలో ఈ మెట్రో కార్ షెడ్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని బీజేపీ ఎంతగానో ప్రయత్నిస్తోంది. అయితే ఇది సుమారు 800ల ఎకరాలకు పైగా ఉన్న అటవీ ప్రాంతం. చుట్టు పక్కల చిరుతలు వంటి ఇతర జీవ జాతులు సంచరిస్తూ ఉండే ఆహ్లాదభరితమైన ప్రాంతాన్ని అభివృద్ధి పేరుతో నాశనం చేయవద్దని థాక్రే విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ విషయమై పర్యావరణ కార్యకర్తలు భారీ నిరసనలు చేపట్టిన సంగతిని సైతం ఆయన గుర్తు చేశారు. వాస్తవానికి అప్పటి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మెట్రో కార్ షెడ్ కోసం గుర్తించిన ప్రాంతం జీవవైవిధ్యం లేదా అటవీ భూమిగా వర్గీకరించబడలేదని, మెట్రో కార్బన్ని తగ్గిస్తుందంటూ వాదించారు.

శరవణ స్టోర్ గోల్డ్ ప్యాలెస్ ఆస్తుల జప్తు

చెన్నై: బ్యాంకును మోసం చేసిన మనీలాండరింగ్ కేసులో తమిళనాడులోని చెన్నై శరణవ స్టోర్ (గోల్డ్ ప్యాలెస్)కు చెందిన రూ. 234.75 కోట్ల విలువ చేసే చరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 25న సీబీఐ, ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈఓడబ్ల్యూ) దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని నిబంధనల ప్రకారం ఈడీ కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపడుతోంది. చెన్నైలోని టి-నగర్‌లో ఉన్న ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను మోసం చేసేందుకు స్టోర్ భాగస్వాములు పల్లకుదురై, పి.సుజాత, వైపీ శిరవణ్‌తో సహా గుర్తు తెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులతో కలిసి కుట్రపన్నారన్న ఆరోపణలు వచ్చాయి. దర్యాప్తులో శరవణ స్టోర్ (గోల్డ్ ప్యాలెస్) రుణాల కోసం బ్యాంకును సంప్రదించినట్లు వెల్లడైంది.

ఈ సంస్థ విక్రయాలు, ఇతర ఆర్థిక లావాదేవీల్లో తేడాలు గుర్తించినట్లు అధికారి తెలిపారు. అదేవిధంగా మరొక మనీలాండరింగ్ కేసులో 'ద లాటరీ కింగ్' వ్యవస్థాపక చైర్మన్ శాంటియాగో మార్టిన్ ఆస్తులను కూడా జప్తు చేసింది. రూ. 173.48 కోట్ల విలువైన చర, స్థిరాస్తులను ఈడీ స్వాధీనం చేసుకుంది. కొచ్చిలోని సీబీఐకి చెందిన అవినీతి నిరోధక శాఖ దాఖలు చేసిన ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేపడుతోంది.

మోదీని విమర్శిస్తే... దేశాన్ని విమర్శించినట్లా?

- బీజేపీ నేత నడ్డా వ్యాఖ్యలు నియంతృత్వం
- అల్లూరిని స్మరించే అర్హత కమలం పార్టీకి లేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శలు
- వామపక్షాల అధ్వర్యంలో అల్లూరి జయంత్యుత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రధాని మోదీని ప్రతిపక్షాలు విమర్శిస్తే..అది దేశాన్ని విమర్శించినట్లేనంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. విజయవాడ బాలోత్సవ్ భవనంలో ఆదివారం వామపక్ష పార్టీల అధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవం నిర్వహించారు. సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ నడ్డా వ్యాఖ్యలు నియంతృత్వ ధోరణితో ఉన్నాయన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే దేశంలో కొంతమంది మహనీయుల విగ్రహాలు నెలకొల్పుతున్నారని, వాస్తవంగా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పించే అర్హత బీజేపీకి లేదని పునరుద్ఘాటించారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును స్మరించే అర్హత ఒక్క వామపక్ష పార్టీలకే ఉందని నొక్కిచెప్పారు. గుజరాత్‌లో సర్ధార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తాజాగా భీమవరంలో అల్లూరి విగ్రహావిష్కరణ పేరిట కుల, మత రాజకీయాలతో మోదీ ముందుకొస్తున్నారని, ఈ చర్యలను ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. నాడు స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో కమ్యూనిస్టులు, కాంగ్రెస్, ముస్లింలీగ్ పార్టీలు ప్రధాన భూమిక పోషించాయని గుర్తుచేశారు. బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనక పోగా, బ్రిటీష్ వారికి పరోక్షంగా సహకరించిందన్నారు. నాడు అల్లూరితోపాటు ఎంతోమంది మహాను భావులు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమించారని కొనియాడారు. చరిత్రను వక్రీకరిస్తూ విద్యార్థులపై హిందూత్వ అజెండా రుద్దే ప్రయత్నం బీజేపీ, ఆరెస్సెస్ చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికలోనూ గిరిజన మహిళ ద్రౌపది ముర్మును తెచ్చి మోదీ నాటకా లాడుతున్నారని మండిపడ్డారు. ఆమె ఎమ్మెల్యేగా, గవర్నరుగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ తన సొంత ఊరికి కరెంటు ఇవ్వలేకపోయారన్నారు. ఇప్పుడు మీడియాలో కథనాలు రావడంతో హడావుడిగా కరెంటు సరఫరాకు చర్యలు తీసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి మహిళ రాష్ట్రపతిగా ఉండి ఏమి చేస్తారని ప్రశ్నించారు. బీజేపీ నేతల చేతుల్లో రబ్బర్ స్టాంప్‌గానే మిగిలిపోతారని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిదేళ్లలో దేశానికి ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. దేశాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ఏ ఒక్క అంశంలోనూ ముందుకు పోవడం లేదన్నారు. రాజ్యాంగ వ్యవస్థలు, పోలీసులను దుర్వినియోగం చేస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. సమరయోధుల పోరాట చరిత్రను ప్రజలకు వివరించేందుకుగాను వామపక్ష శ్రేణులు మరింత ముందుకు సాగాలని కోరారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ అల్లూరి జీవిత చరిత్ర దేశానికే ఆదర్శమన్నారు. ఒకవైపు గిరిజన హక్కులు, మరోవైపు స్వాతంత్ర్య పోరాటంతో ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. మోదీ రకరకాల వేషాలతో దేశ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మోదీకి ఎవరినైనా వాడుకుని వదిలేసే అలవాటుందని ఎద్దేవా చేశారు. మహనీయుల విగ్రహా లను ఎత్తుగా నిర్మిస్తూ, వారి ఆశయాలను మాత్రం పాతాళానికి తొక్కిపారేస్తున్నారని దుయ్యబట్టారు. గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తదితర జాతీయ నేతలను ఒకే కులానికి అంటగట్టే విధానాల్ని తప్పుపట్టారు. దేశంలోని బడా కార్పొరేట్ కంపెనీలను అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు మాట్లాడుతూ గిరిజనుల్లో సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని రగిల్చి..పోరాట యోధులుగా అల్లూరి తీర్చిదిద్దారని కొనియాడారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. విభిన్న సంస్కృతుల పోరాట సంగ్రామం దేశ స్వాతంత్ర్యోద్యమ సంగ్రామమని పేర్కొన్నారు. నాడు అల్లూరి, కొమరం భీమ్ తదితరులు స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఈ పోరాటాలు, త్యాగాల్లో నాడు జన్‌సంఘ్, బీజేపీ ప్రమేయం ఎక్కడా లేదని నొక్కిచెప్పారు. మోదీని జవహర్‌లాల్ నెహ్రూతో పోల్చడాన్ని తప్పుపట్టారు. మోదీ నవనిర్మాణం ప్రకటన ఒట్టి బూటకమన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసి, మొత్తం వ్యవస్థను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. కార్మికుల పని దినాలను 8 గంటల నుంచి 12 గంటలకు పెంచుతూ, వారి హక్కులను కాలరాస్తున్న దన్నారు. ఇలాంటి మోదీకి, బీజేపీకి అల్లూరి పేరును ప్రస్తావించే అర్హత లేదన్నారు. తొలుత సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ స్వాగతం పలికారు. ఈ సమావేశంలో వివిధ వామపక్ష పార్టీల నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.







Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.